57370

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



స్నేహ

డిసెంబర్ 13, 2009

పుస్తకాల పండుగ

హ్యాపీ బర్త్‌డే

(2009 డిసెంబర్
13 నుంచి 2009
డిసెంబర్ 19 వరకు)

ఎం.డి.వై.సోహైల్
5సం॥, డిసెంబర్-2004
షబానా-అక్బర్
దోమల్‌గూడ-హైదరాబాద్

అయిలమ్మ
6సం॥,డిసెంబర్-2003
సుమిత్ర-రమణ
విశాఖపట్నం

జి.ఆజాద్
2సం॥, డిసెంబర్-19
నాగమణి-కాంతారావు
విశాఖపట్నం

టి.మను-రఘు
డిసెంబర్-15
హైమావతి-వేలాద్రి
మునగాల-నల్లగొండ

స్ఫూర్తి
2సం॥, డిసెంబర్-18
లక్ష్మి-రఘుపతి
ఆరుట్ల-రంగారెడ్డి

కె.మౌనోగ్న
1సం॥,డిసెంబర్-18
సమత-రాజేష్‌రెడ్డి
మంగళగిరి-గుంటూరు

అంజనా సరయు
1సం॥, డిసెంబర్-14
గాయత్రి-వీరాంజనేయులు
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

కె. వదింత
9సం॥, డిసెంబర్-19
విద్య-వెంకటేష్
అనంతపురం

కె. వెన్ని
1సం॥, డిసెంబర్-2008
సునంద-నవీన్‌కుమార్
మధిర-ఖమ్మం

విరీష(మిని)
డిసెంబర్-14
మౌనిక-శివప్రసాద్
శింగరాయకొండ-ప్రకాశం

ఎస్. వర్ష
3సం॥, డిసెంబర్-2006
సౌజన్య-బద్రినాథ్
కొల్లమాసనపల్లి-చిత్తూరు

భావేష్
3సం॥, డిసెంబర్-14
శ్రీలక్ష్మి-సుబ్రమణ్యం
తిరువూరు-కృష్ణా

ఎన్. జోగేంద్ర ప్రసాద్
6సం॥, డిసెంబర్-2003
లక్ష్మివందన-శ్రీనివాసరావు
హైతినగరం-శ్రీకాకుళం

మనలో మాట

వేడెక్కిన విశ్వం

అసలే వేసవి కాలం. పైగా మిట్టమధ్యాహ్నం. ఎండ మండిపోతోంది. సరిగ్గా అప్పుడే కరెంట్ పోయింది. గదిలో ఫ్యాను ఆగిపోయింది.

అప్పుడెలా వుంటుంది? ఉక్క. చెమట మొదలౌతుంది. భరించలేక చికాకుపడతాం!

అలాంటిది ప్రపంచమంతా వేడెక్కితే! భూమి నిప్పుల కొలిమిలా తయారైతే!!

ఓ పక్క అతివృష్టి. మరోపక్క అనావృష్టి తిష్టవేస్తాయి. జీవనదులు సైతం ఎండిపోయి వర్షాధార నదాలుగా మారిపోతాయి. మంచుముద్దలాంటి ఆర్కిటిక్ హిమఖండంలో చూద్దామన్నా మంచుముక్క కానరాదు. సముద్రాలు పొంగి పొర్లి పల్లపు దేశాలను, ద్వీపాలను ముంచేస్తాయ్. లక్షలాది ప్రాణాలను బలిగొంటాయ్. తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకవ్. తినడానికి బియ్యం, రొట్టెలు కరువవుతాయ్. నైరుతి రుతుపవనాలు మొహం చాటేస్తాయ్.

ఇలా బతగ్గలమా? ఇదంతా భరించగలమా? ఊహించడమే కష్టం.

దీనికంతటికీ కారకులెవరో తెలిస్తే...కాలరు పుచ్చుకుని మరీ నిలేయాలనిపిస్తుంది. లెంపలు వాయించాలనిపిస్తుంది. చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందేనని హూంకరించిమరీ చెప్పాలనిపిస్తుంది. అదే న్యాయం కూడా.

కాలుష్య ఉద్గారాలను విచ్చలవిడిగా వదులుతున్న ధనిక దేశాలు మాత్రం అందుకు సిద్ధంగా లేవు. పైగా తాము చేసిన పాపాన్ని బీద దేశాలు భరించాల్సిందేనంటున్నాయి.

ప్రపంచ జనాభాలో 4 శాతం జనాభా కలిగిన అమెరికా 16 శాతం కాలుష్యాన్ని విడుదలచేస్తూ నంగనాచిలా మాట్లాడుతోంది. అందరూ తలా ఒక చెయ్యి వేసి ఈ సమస్యను పరిష్కరించుకుందామని పెద్దమనిషిలా చెప్తోంది. ఇప్పటికైనా కాలుష్య ఉద్గారాలను తగ్గించుకోమని నీతివచనాలు వల్లిస్తోంది. అయితే తను మాత్రం ఎంత కాలుష్యాన్ని తగ్గించేదీ చెప్పదంట. ఇదెక్కడి విడ్డూరం?

చదువుతుంటేనే పిడికిళ్లు బిగుసుకుంటున్నాయికదూ. ధనిక దేశాలను నిలేయాలనిపిస్తోందికదూ. తాజాగా కోపెన్‌హెగెన్‌లో జరుగుతున్న సమావేశంలో పేదదేశాల ప్రతినిధులు ఈ పనే చేయాలి. మానవాళిని, ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న దేశాల మెడలు వంచి మరీ పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టేలా చూడాలి. భూమిని చల్లగా కాపాడుకోవాలి.

అందుకోసం మానవాళే మేల్కొనాలి.

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
ఆరోగ్యం	...	7
కథ	...	8
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
విజ్ఞాన వీచిక	...	18
తెల్సా	...	19
వికాసం	...	20
నవ్వుల్ పువ్వుల్	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

అదే స్ఫూర్తితో...



చూద్దామా ... 10

కాశీ విశేషాలు



తేలు కుట్టిన దొంగలు ... 22



ఆకర్షించిన ఓరుగల్లు విశేషాలు

నవంబర్ ఆదివారం స్నేహలో చారిత్రక నగరం ఓరుగల్లు విశేషాలు ఆకర్షించాయి. కాకతీయుల ప్రతిభాపాటవాలకు ఆలవాలమై స్వర్ణయుగంగా పేరొంది విభిన్న రీతుల తెలుగువారి ఔన్నత్యాన్ని చాటిచెప్పిన నగరం. దీనినే ఏకశిలా నగరం, ఒంటి మిట్ట అంటారన్న విషయం అందరికీ తెలియదు. ప్రతాప రుద్రుడు, యుగంధర్, రాణీరుద్రమ, భక్త పోతన ఏనాటికీ మరువలేని మహాత్యాగులు. ఓరుగల్లు గత వైభవానికి ప్రతీక.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

చేదోడు వాదోడుగా...

"ఆ పని ఆమెదేనా" చాలా బాగుంది. భార్యకు భర్త, భర్తకు భార్య ఎలా చేదోడు వాదోడుగా వుండాలో చక్కగా వివరించారు. పరిస్థితిని అనుసరించి ఒకరి బాధ్యతలను ఒకరు స్వీకరించడం బాగుంది. "భర్తకంటే భార్య ఎక్కువ, భార్యకంటే భర్త ఎక్కువ అని కాకుండా భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరు సహకరించుకోవాలని, భార్యాభర్తల్లో ఎవరు విజయం సాధించారనేది కాకుండా వారిద్దరూ కలసి తమ కుటుంబాన్ని చక్కదిద్దుకోవడం ఎలా? అందులో వారు ఎంత వరకు విజయం సాధించారనేది ముఖ్యం" అని చెప్పిన సంధ్యగారికి నా అభినందనలు.

కె. నరసింహారావు, కట్టకూరు,
ఖమ్మం.

మహమ్మారిని అర్థంచేసుకున్నాం

అట్టమీది కథ "ఎయిడ్స్ భూతాన్ని తరిమేద్దాం" చదివిన తర్వాత ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న మహమ్మారి ఎయిడ్స్ అంటే ఏంటి? హెచ్ఐవి ఎలా సంక్రమిస్తుంది? వ్యాధి నిర్ధారణ ఎలా? రోగికి మేలుచేసే ఎ.ఆర్.టి మందుల తరగతులు, నివారణోపాయాల గురించి తెలుసుకున్నాం. మన రాష్ట్రంలో 1987లో హెచ్ఐవి కేసును గుర్తించడం, ఎయిడ్స్ ఎక్కువ వున్న ఆరు రాష్ట్రాల్లో మన రాష్ట్రం ఒకటిగా వుండడం, స్త్రీ పురుషుల్లో 7శాతం మంది సుఖవ్యాధులతో ఉండడం బాధాకరం. ఎయిడ్స్‌కు నివారణ తప్ప మందులు లేవన్నా, ఇటీవల నూతన మందులను కనుగొనడం వ్యాధిగ్రస్తులకు మేలు చేకూరే విషయం. డిసెంబర్ 1న ఎయిడ్స్ వ్యతిరేక దినం జరుపుకుంటున్నా ప్రభుత్వం సరైన అవగాహన కల్పించడం లేదు. ఎయిడ్స్ నిర్మూలనా కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు నిధులుగా కేటాయిస్తున్నా ఎయిడ్స్ వ్యాధిని నయం చేయలేకపోతోంది. తేదీలు - నిజాలు ద్వారా అనేక విషయాలు తెలిశాయి. ఎయిడ్స్ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగింది.

కామిడి సతీష్ రెడ్డి,
పరకాల, వరంగల్.

ఉద్యమకారులు చదవాల్సిన నవల

మన దేశంలో హెచ్ఐవి ఎక్కువగా వున్న ఆరు రాష్ట్రాల్లో మన రాష్ట్రం ఒకటి. అన్ని జిల్లాల్లోనూ ఎయిడ్స్ బాధితులున్నారు. 2002 లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో నాలుగు లక్షల మంది హెచ్ఐవి పాజిటివ్ కేసులున్నాయి. ప్రజలు ఆందోళనకు గురవుతారని ప్రభుత్వం మరణాల సంఖ్యను ప్రకటించడం లేదు. లైంగిక సంబంధాలు ఎయిడ్స్‌కు ప్రధాన కారణం. సెక్స్ కోరికలను రేకెత్తించేవిధంగా అశ్లీల పాత్రలతో, జుగుప్సాకరమైన సన్నివేశాలతో సినిమాలు యువతను పెడదోవ పట్టిస్తున్నాయి. విష సంస్కృతి ప్రభావం మన సమాజంపై తీవ్రంగా వుంది. స్ఫూర్తి శీర్షికలో జాక్ లండన్ రచన 'ఉక్కుపాదం'ను పరిచయం చేసినందుకు అభినందనలు. ఈ నవల విప్లవకారులకు స్ఫూర్తినిస్తుంది. కార్మికవర్గ పోరాట చరిత్రను ఉద్యమకారులందరూ తెలుసుకోవాలి.

టి .శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖపట్నం.

శాంభవి సినిమా వచ్చినా ఆశ్చర్యంలేదు

నవంబర్ ఆఖరి ఆదివారం స్నేహ అట్టమీది కథగా ఎయిడ్స్ భూతాన్ని తరిమేద్దాం... ద్వారా విలువైన, ఉపయుక్తమైన సమాచారాన్ని అందించారు. చూద్దామాలో ఓరుగల్లు విశేషాలు బాగున్నాయి. సినిమా కబుర్లు, తెలుగుతెర బాలల చిత్ర సంగతులు అనేక విశేషాలు మాముందుంచారు. 'చిన్నతల్లి' వార్తను చదివిన వారెవరైనా, ఔరా అనాల్సిందే. ముత్యాల ముచ్చట్లు అంశం వల్ల ముత్యాల కొనుగోలులో పాటించాల్సిన జాగ్రత్తలు అర్థమయ్యాయి. విజ్ఞాన వీచిక రంగుల్లో ఆకర్షింప చేసింది. చంద్రునిమీద నీటి వునికి ఇంకెన్ని అద్భుతాలు చేస్తుందో వేచి చూడాల్సిందే. రుచిలో వంటకాలన్నీ ఆరోగ్యకరమైనవే అవడం విశేషం. ఆరోగ్యం ద్వారా ఆస్తమా గురించి విపులంగా తెలుసుకున్నాం. పనిపిల్ల, ఓ పిట్టకథ కథలు బావున్నాయి. కవితలన్నీ భావగర్భితంగా ఉండడం గమనార్హం. మనలోమాట బావుంది. అరుంధతి జేజమ్మల వల్లనే సూర్యనంది శాంభవిలు పుట్టుకొస్తున్నారు. రేపు శాంభవి కథనంతో సినిమా వచ్చినా ఆశ్చర్యపోనవసరంలేదు!!

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

దడాల మాట నిజమే

కథానాయకుడు చెప్పేది స్వీయానుభవంతో వుంటుంది. అందువల్ల నవల చదివిన వారికి బాగా మనసుకి హత్తుకొనేట్లు వుంటుంది. అదేవిధంగా ఉక్కుపాదం నవలలో ఎర్నెస్ట్ మాట్లాడతాడు. నవలలోని అనుభవాన్ని సి.పి.యం. రాజకీయానికి అన్వయించి చెప్పడంలో రచయిత దడాల సుబ్బారావుగారు చక్కని



అనుభవం చూపించారు. రచయిత జాక్‌లండన్ పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు కలిసి కార్మిక వర్గాన్ని దోచుకునే విధానాన్ని వందేళ్ల కిందటే వాదనలతో బహిరంగపర్చడం వల్ల ఆ నవల ఈనాటికీ పాఠకుల మనస్సుల్లో నిలిచిపోయింది. కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రత్యక్ష కార్యాచరణలో ఈ నవల మనోనిబ్బరాన్ని ఇస్తుందన్న దడాల సుబ్బారావుగారి మాట అంగీకరించదగ్గదే. తను నాగాలు పెట్టకుండా వస్తానని, తన పని నాణ్యతను చెప్పి అందుకు తగ్గట్టు జీతం అడగటంలో పనిపిల్ల మాటకారితనం చూపించింది. స్కూల్‌కి వెళ్లడం ప్రధానంగా తిండికోసమే. అలాగే యజమాని కొడుకులు తినేటప్పుడు తానెప్పుడు ఇలాంటి భోజనం తింటానన్న కోర్కెను మనస్సునిండా పెట్టుకున్నది. మీ ఇంట్లో వేడి, వేడి తిండి పెడతారు, పని మాననంటుంది. కథ మనస్సును హత్తుకుంది. వరంగల్ మొదట ఓరుగల్లు పేరుతో వుంటుంది. ద్రవిడ భాషల్లో ఒకటైన తమిళంలో ఓరుగల్లు అంటే ఒంటిరాయి అని అర్థం. దీన్నే సంస్కృతం - తెలుగు కలుపుకుంటూ ఏకశిలా నగరం అని పిలుస్తారు. ముత్యాల ముచ్చట్లు చదివినప్పుడు ఢిల్లీ సుల్తాన్ ప్రతాపరుద్రుణ్ణి పట్టుకునిపోతే మంత్రి యుగంధరుడు ముత్యాల నాణ్యత చూపే పేరుతో ప్రతాప రుద్రుణ్ణి తీసుకొచ్చిన చరిత్ర గుర్తుకొచ్చింది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
విజయవాడ.

★



చేప వేపుడు

కావలసిన వస్తువులు

కొరమీను చేప - 1/4 కిలో,
పచ్చిమిరపకాయలు - మూడు,
నూనె - 100 గ్రాములు,
ఉప్పు- రుచికి సరిపడా,
కారం - ఒక స్పూను,
పసుపు - కొంచెం,
చింతపండు - నిమ్మకాయంత,
వెల్లుల్లి రెబ్బలు - నాలుగు, ఉల్లిపాయ - ఒకటి,
అల్లం - చిన్న ముక్క, మసాలా దినుసులు - ఒక్కొక్క స్పూను.

తయారుచేసే విధానం

చేప పైపొలుసులు తీసేసి శుభ్రంగా కడగాలి. తల తీయకూడదు. గొంతు దగ్గర కోసి లోపల పనికిరానిదంతా తీసివేయాలి. చింతపండు పులుసును తయారు చేసుకోవాలి. ఇప్పుడు శుభ్రం చేసిన చేపను ఒక పాత్రలో ఉంచి ఉప్పు, కారం వేసి, చింతపండు పులుసును పోయండి. కొంచెం పసుపు వేయండి. వెల్లుల్లి పాయలు, అల్లం కూడా నూరి వేయాలి. ఈ మిశ్రమాలన్నీ చేపకు బాగా పట్టాలి. అందుకు రెండు గంటల సేపు ఆ చేపను అందులో ఉంచాలి.

తర్వాత చేపలు పట్టే సైజుకన్నా పెద్ద మూకుడును పొయ్యి మీద పెట్టాలి. నూనె పోసి కాగనివ్వాలి. చేపను చేత్తో పట్టుకుని మసాలాలను అద్ది దాన్ని నూనెలో బాగా ఎర్రగా వేయించండి. మరీ మెత్తగా ఉండకూడదు. గట్టిగా ఉండకూడదు. చేప వొలిస్తే బిళ్ళల్లా చేతిలోకి వచ్చేటట్లు వేయించుకోవాలి.

నూనెలోంచి తీసి చేపను పళ్లెంలో పెట్టుకోవాలి. ఇప్పుడు కళాయిలో మరికొంత నూనె పోసి పచ్చిమిర్చి, ఉల్లిపాయలు బాగా వేయించాలి. వాటిని వేయించిన చేపమీద పరవాలి. కొత్తిమీరను కూడా పైన చల్లాలి. దీనికి కొరమీను అయితేనే రుచిగా ఉంటుంది. మిగతా చేపలు అంతగా బాగుండవు.

నిమ్మకాయలతో కోడికూర

కావలసిన పదార్థాలు

చికెన్ బ్రెస్ట్ పీసులు - నాలుగు,
మిరియాలపొడి - స్పూను,
అల్లం - చిన్న ముక్క, వెల్లుల్లి- 8 రెబ్బలు, ఉప్పు- కొద్దిగా, గరం మసాలా - కొద్దిగా,
ఉల్లిపాయలు - 150 గ్రాములు,
క్యాప్సికమ్ - 150 గ్రాములు, నూనె - 100 గ్రాములు, పెరుగు - 100 గ్రాములు, నిమ్మకాయలు- 3, పసుపు - కొద్దిగా, కొత్తిమీర - ఒక కట్ట.

తయారుచేసే విధానం

ఉల్లిపాయలను నిలువుగా కాకుండా చక్రాల్లా కోసి ఉంచుకోవాలి. అల్లం, వెల్లుల్లిని మెత్తగా ముద్దలా నూరి ఉంచుకోవాలి. చికెన్ బ్రెస్ట్ పీసులను ఎముకలు లేకుండా చూసుకోవాలి. వాటిలో అల్లం, వెల్లుల్లి ముద్ద, ఉప్పు, కొద్దిగా గరం మసాలా పట్టించి గంటసేపు నాననివ్వాలి. ఆ ముక్కలకు నూనె పూసి ఒక ప్లేటులో ఉంచుకోవాలి.

పెరుగును వడపోసి దాంట్లో మిరియాలపొడి, మిగిల్చి ఉంచిన గరంమసాలా, తగినంత ఉప్పు, కలిపి మిశ్రమంలా చేయాలి. ఈ మిశ్రమాన్ని చికెన్ పీసుల మీద పూసి చక్రాలుగా కోసి ఉంచుకున్న ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికమ్ కూడా చేర్చి ఓవెన్‌లో బేక్‌చేసి వడ్డించాలి.

బొమ్మిడాయలు చింతకాయల ఇగురు

కావలసిన వస్తువులు

బొమ్మిడాయలు - ఇరవై ఐదు, చింతకాయలు - అరకిలో,
దనియాలపొడి - రెండు స్పూన్లు, జీలకర్ర - ఒక టీ స్పూను, అల్లం - చిన్న ముక్క, వెల్లుల్లిపాయలు - రెండు, ఉల్లిపాయలు- మూడు, నూనె - 100 గ్రాములు, కారం, ఉప్పు - రుచికి సరిపడా, పసుపు - కొంచెం,
పచ్చిమిర్చి - నాలుగు, పచ్చికొబ్బరి - నాలుగు, ఉల్లికాడలు - ఒక పాయపొద,
ఆవాలు- కొద్దిగా, కొత్తిమీర - ఒక కట్ట, కరివేపాకు- రెండు రెబ్బలు,

తయారుచేసే విధానం

ఉల్లికాడలను సన్నగా ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి కోసి పెట్టుకోవాలి. చింతకాయలు ఉడికించి పిసికి పిప్పి తీసేయాలి. కొబ్బరిపాలు తీసి పెట్టుకోవాలి. అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, దనియాలు బాగా మెత్తగా నూరి ఉంచుకోవాలి. ఒక కళాయిలో 50 గ్రాములు నూనె పోసి బాగా కాగాక చేపలు వేసి వేపుకోవాలి. ఆ చేపల్లో నూరిన అల్లం, ఉప్పు, కారం, పసుపు, చింతకాయల పులుసు వేయాలి. ఒక బాణలిలో నూనె పోసి బాగా కాగనివ్వాలి. తాలింపు దినుసులు వేసి ఉల్లికాడల ముక్కలు వేసి కొంచెం వేగనివ్వాలి. తర్వాత ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. అవి బాగా వేగాక ఇంతకు ముందు వేయించి పెట్టుకున్న చేపలు వెయ్యాలి. సన్నటి సెగమీద ఒక పావుగంట ఉంచితే ముద్దగా అవుతుంది. అప్పుడు కొబ్బరిపాలు, కొత్తిమీర వేసి మరో ఐదు నిమిషాలు ఉంచితే ముద్దగా తయారవుతుంది. దింపి వడ్డించవచ్చు.



నల్లకూర

కావలసిన వస్తువులు

మేక రక్తం - రెండు అచ్చులు (గడ్డకట్టినది),
పచ్చిమిర్చి - ఎనిమిది, కారం - నాలుగు స్పూన్లు,
గసగసాలు - నాలుగు స్పూన్లు, దనియాలు- రెండు స్పూన్లు,
నూనె - 200 గ్రాములు, ఉల్లిపాయలు - నాలుగు,
దాల్చిన చెక్క - రెండు బద్దలు, లవంగాలు - పది,
అల్లం - చిన్న ముక్క, కొత్తిమీర - చిన్న కట్ట, ఉప్పు సరిపడా.

తయారుచేసే విధానం

నల్లను శుభ్రంగా కడగాలి. నల్లకి కొంచెం ఉప్పు తగిలించి గరిటెతో చిన్న చిన్న ముక్కలు చేసి స్టౌమీద పెట్టాలి. నీరు ఇగిరాక దింపేయాలి. ఒక కళాయిలో నూనెపోసి బాగా కాగాక దాల్చినచెక్క, లవంగాలు, ఉల్లిపాయ ముక్కలు వేయించి ఇగిరిన కూరను అందులో వేసి తిప్పాలి. అల్లంవెల్లుల్లి ముద్దను అందులో వేయాలి. తర్వాత గసగసాలు, దనియాల పొడి వెయ్యాలి. ఎర్రగా వేగిన తరువాత కొత్తిమీరను చల్లి దింపుకోవాలి.



యన్.యస్. లక్ష్మీదేవమ్మ
ఐద్వా సీనియర్ నాయకులు.

అదే స్ఫూర్తితో...



అది 1987వ సంవత్సరం. మహబూబ్‌నగర్ జిల్లాలో తీవ్ర కరువు వచ్చింది. వనపర్తి డివిజన్ గుమ్మడం గ్రామంలో ఆకలి చావు సంభవించింది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారే స్వయంగా ఆ గ్రామానికి వచ్చి ఆకుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి పరిశీలించి అది ఆకలి చావని నిర్ధారించారు.

ఈ వార్త చదివి నిర్ఘాంతపోయాను. నేను మహబూబ్‌నగర్ వాసిని. పిల్లల చదువుకోసం హైదరాబాద్ వచ్చాం. మా జిల్లాకు 'కరువు జిల్లా' అని పేరుకూడా వుంది.

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఈనాటికీ ఆకలి చావులు సంభవించడం నిజంగా పాలకుల దుష్టపాలన ఫలితమే! ఉన్నోడు ఉట్టికి, లేనోడు కాటికి పోయే కాలమా ఇది? కకావికలమైన మనసులో ఏదో పట్టుదల మొదలైంది. జిల్లాకు ఏదైనా చెయ్యాలి. కష్టాలలో వున్న జిల్లా వాసులను ఆదుకోవాలన్న ఆలోచన మొదలైంది.

ఒక ఉద్యమాన్ని నిర్మించాలంటే ఆషామాషీ కాదు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. అనేక నిర్బంధాలకు గురవుతూ, కష్టాలు పడుతూ, ఆకలి దప్పులతో అలమటిస్తూ మహారాష్ట్రలోని గిరిజనులైన వర్లీలలో పనిచేసి బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్మించారు గోదావరి పరులేకర్. ఉద్యమించడమేకాక వారిని వెట్టిచాకిరీ నుండి విముక్తి గావించారు. ఈ విషయాలను కళ్లకు కట్టినట్టు "వర్లి ఆదివాసుల తిరుగుబాటు" అన్న పుస్తకంలో వివరించారామె. ఈ గ్రంథమే నేను కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేయడానికి ఎంతగానో స్ఫూర్తినిచ్చింది.

మహారాష్ట్రలో థానె జిల్లా ఒకటి. ఆ జిల్లాలోని అంబెర్‌గావ్‌దహను, పాల్‌ఘర్, జవహర్ తాలుకాల అడవులలో అనేక గిరిజనగణ జాతులు నివసిస్తున్నాయి. వారిని ఆదివాసులంటారు. ఈ ఆదివాసి జనాభాలో 50 శాతం వర్లీలు. సుమారు 100 సంవత్సరాల క్రితం ఈ భూమికంతా వీరే యజమానులు. బ్రిటీషువారి రాకతో అనేకమంది ఇతరులు ఈ ప్రాంతంలోకి చొరబడ్డారు. ఆదివాసుల భూమి అత్యధిక భాగం కొత్తగా వచ్చిన వారి పరమైంది. వీరు పెద్ద భూస్వాములుగా మారారు. ఈ కొత్తగా వచ్చిన భూస్వాములు హేయమైన నేరాలకు, హింసకు పూనుకున్నారు.

బొంబాయికి 60 కిలోమీటర్ల దూరంలోనున్న ఈ ఆదివాసి ప్రాంతంలో రోడ్లు లేవు. ఆసుపత్రులు లేవు. పాఠశాలలు లేవు. ఉన్నదల్లా అజ్ఞానం, దు:ఖం, వ్యధలు, అమాయకత్వాలే.

ఆ కాలంలో భూస్వాములు, వడ్డీవ్యాపారులు తమ ఇళ్లలో కొరడాలు సిద్ధంగా ఉంచుకునేవారు. వర్లీలను కట్టేయడం, కొట్టడం భూస్వాముల దృష్టిలో సర్వసాధారణమైన విషయం.

జీవితమంతా చిత్రహింసలకు గురైన ఆదివాసులు ఆనాటికి సహించలేని స్థితికి చేరారు. ఈ హింసను భరించడం కన్నా చావడం మేలనుకోవడం ప్రారంభించారు.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో పచ్చగడ్డికి మంచి గిరాకీ వచ్చింది. భూస్వాములు గడ్డి మీద లక్షలు సంపాదించినా కూలీకి మాత్రం 2 నుండి 4 అణాలు మాత్రమే ఇచ్చేవారు. భూస్వామి బొక్కసాలలో లక్షల రూపాయలు నింపేందుకు ఎక్కువ భాగం వెట్టిచాకిరీతోనే కోసేవారు.

"ఆకలితో అల్లాడుతున్న వారి పరిస్థితి చూసినప్పుడల్లా నా రక్తం ఉడికేది" అన్న గోదావరి పరులేకర్ మాటలు చదువుతుంటే అంత మానవత్వం ఉట్టిపడింది గనుకనే వాళ్ల జీవితాలను మార్చాలి, ఈ హింసను ఆపాలి, వెట్టి చాకిరీ రద్దు కావాలి అనే పట్టుదలతో వర్లీల మధ్య పనిచేశారు. ఆకలిదప్పులతో టీకి కూడా నోచుకోక తవుడు రొట్టెలు తింటూ వాళ్లను పోరాటాలకు సిద్ధం చేశారు. వర్లీలు ఆమెను ఆప్యాయంగా "గోదారాణి" అని పిలుస్తుండేవారు.

ఆమె ఒక ఉన్నత మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఉన్నత శ్రేణి సంపన్న కుటుంబానికి చెందిన యస్.వి పరులేకర్‌గారిని జీవితభాగస్వామిగా ఎన్నుకున్నారు. పేదప్రజల ఉద్ధరణ కోసం వీరుభయులూ కమ్యూనిస్టు పార్టీలో చేరి సమాజ మార్పుకు కృషి చేశారు.

ఈ పుస్తకం చదివినంత సేపూ "పోరాటం చేస్తే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ల తప్ప" అన్న మార్క్స్ మహనీయుని సూక్తి గుర్తుకొస్తుంది. వెట్టిచాకిరీ చేస్తూ తిండికి నోచుకోక, కొరడాదెబ్బలు తింటూ బతుకీడుస్తున్న ఆ మూగజీవులు ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి ఎన్నో హక్కులు సాధించుకోవడాన్ని మనం ఆ పుస్తకంలో తెల్సుకుంటాం.

నాకు చిన్నప్పటి నుండి పుస్తకాలు చదివే అలవాటు వుంది. మా పెదనాన్న వాళ్ల ఇంటికి ఎదురుగా గ్రంథాలయం వుండేది. ఆ గ్రంథాలయంలో 'చందమామ, బాలమిత్ర, బాల' లాంటి పుస్తకాలు చదివేదానిని. అలా నాకు పుస్తకాలు చదవటం అలవాటయింది. అలాగే నా హైస్కూల్ జీవితంలో మా హెడ్మాస్టర్ కె. వెంకటేశ్వరరావు గారు వుండేవారు. ఆయన చాలా

నియమ నిబద్ధతలు, క్రమశిక్షణ కల్గినవారు. ప్రతి వారం స్కూల్ లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు తెచ్చుకుని చదవాలని నిబంధన పెట్టేవారు. అప్పుడు చదివినవే స్వామీ వివేకానంద సరస్వతి రాసిన "సత్యార్థ ప్రకాశం". ఈ పుస్తకం ద్వారా నాలో హేతువాద బీజాలు పడ్డాయి. తర్వాత కందుకూరి వీరేశలింగం పంతులు గారి "రాజశేఖర చరితము", అలాగే గురజాడ అప్పారావు గారి "కన్యాశుల్కం", ఉన్నవ లక్ష్మీనారాయణ "మాలపల్లి"... వంటి గ్రంథాలు చదివాను.

తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరాక "అమ్మ" మొదటిసారి చదివినప్పుడు 'పావెల్' లాంటి కొడుకు వుండాలని, నేను 'అమ్మ'లాగా తోడ్పడాలని కలలు కనేదాన్ని. ఆ కలలు నెరవేరాయి.

అది 1987వ సంవత్సరం. మహబూబ్‌నగర్ జిల్లాలో తీవ్ర కరువు వచ్చింది. వనపర్తి డివిజన్ గుమ్మడం గ్రామంలో ఆకలి చావు సంభవించింది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారే స్వయంగా ఆ గ్రామానికి వచ్చి ఆకుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి పరిశీలించి అది ఆకలి చావని నిర్ధారించారు.

ఈ వార్త చదివి నిర్ఘాంతపోయాను. నేను మహబూబ్‌నగర్ వాసిని. పిల్లల చదువుకోసం హైదరాబాద్ వచ్చాం. మా జిల్లాకు 'కరువు జిల్లా' అని పేరుకూడా వుంది.

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఈనాటికీ ఆకలి చావులు సంభవించడం నిజంగా పాలకుల దుష్టపాలన ఫలితమే! ఉన్నోడు ఉట్టికి, లేనోడు కాటికి పోయే కాలమా ఇది? కకావికలమైన మనసులో ఏదో పట్టుదల మొదలైంది. జిల్లాకు ఏదైనా చెయ్యాలి. కష్టాలలో వున్న జిల్లా వాసులను ఆదుకోవాలన్న ఆలోచన మొదలైంది.

జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 16 కేంద్రాల్లో అంబలి కేంద్రాలు నడుస్తున్నాయని తెలిసింది.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యురాలినైన నేను కొన్ని సంవత్సరాలుగా కొన్ని కారణాల రీత్యా పార్టీ సానుభూతిపరురాలిగా వుండిపోయాను. అప్పుడు రాష్ట్ర పార్టీ సెక్రెటరీగా కామ్రేడ్ మోటూరు హనుమంతరావు గారు వుండేవారు. సానుభూతి పరురాలిగా వుంటూ వారితో సంబంధాలు వుండేవి. అందుకే నన్ను మోటూరు హనుమంతరావు "అజ్ఞాత సోదరి" అనేవారు. ఈ ఆకలి చావులను ఆయనతో ప్రస్తావించి, జిల్లాకెళ్లి ఏదో కొంత చేయాలన్న నా నిర్ణయాన్ని తెలిపాను. వారి అంగీకారంతో జిల్లా ఉద్యమంలో భాగస్వామినయ్యాను. హైదరాబాద్ నుండి మహబూబ్‌నగర్‌కు వెళ్లి పని చేయడమంటే కష్టంతో కూడుకున్నదని, ఆరోగ్య సమస్యలు రావొచ్చని ఆయన బాధ. జిల్లాలో బట్టలు, ధాన్యాన్ని కొంతమంది మహిళలం దళంగా వెళ్లి సేకరించి అంబలి కేంద్రాల్లో పంచాం.

పక్కనే వున్న కర్నూలు మహిళా సంఘం నాయకురాలు టి.సి.లక్ష్మమ్మ గారు కర్నూలు జిల్లాలో ధాన్యాన్ని సేకరించి పంపడమే కాక మా జిల్లాకు వచ్చి అంబలి కేంద్రాలను చూశారు.

10 సంవత్సరాలుగా జిల్లా మహిళా సంఘం కార్యదర్శిగా ఉంటూ ఉద్యమం వున్న డివిజన్లలోని అన్ని గ్రామాలు తిరిగేదాన్ని. రాత్రిపూట సమావేశాలు జరిపి వాళ్లకు రాజకీయాలు బోధించేదాన్ని.

దురదృష్టమేమిటంటే మహబూబ్‌నగర్ జిల్లాలో 16 కేంద్రాల్లో అంబలి పోస్తున్న పార్టీ గురించి వాళ్లకు తెలియదు. అందుకే సమావేశాలు జరిపినప్పుడు వాళ్లలో చైతన్యం కలిగిస్తూ ఎర్రజెండా ప్రాముఖ్యతను వివరించే దాన్ని.

కూలి రేట్ల విషయంలో గవర్నమెంటు ఒక జీ.ఓ ను పాస్ చేసింది. దానిని గురించి అక్కడివారికి తెలీదు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో మీటింగులు పెట్టి జీఓ ను గూర్చి తెలపడే కాకుండా మండలానికి వెళ్లి మండలాధికారిని కలవాల్సిన అవసరం గూర్చి చెప్పాం. అందరూ కదిలారు.

కూలి పెంపుకు కావలసిన అవసరం వుందని గ్రహించి పార్టీ కూలి రేట్ల మీద సమ్మె చేయించాలనుకున్నాం. గట్టు ఇప్పలిపల్లి అనే గ్రామంలో భూస్వాములు అతి తక్కువ కూలి ఇస్తున్నారు. భూస్వాములు వాళ్ల శ్రమను దోచుకుంటున్నారు. వాళ్లను సంఘటితం చేయడానికి వారం రోజులు వారం రోజులపాటు ఆ గ్రామంలో వుండాల్సి వచ్చింది.

అప్పుడు నా మదిలో మెదిలింది గోదావరి పరులేకర్ గ్రంథం "వర్లి ఆదివాసుల తిరుగుబాటు". ఆమె వాళ్లను సమీకరించుకోవడానికి వాళ్ల మధ్య వుంటూ వాళ్లు తినే తవుడు రొట్టెలు తింటూ, మేకపాల టీ తాగుతూ గడిపింది.

మా పాలమూరు జిల్లాలో అంబలే తిండి. అలా వాళ్ల మధ్య వుండి అంబలి తాగుతూ గడిపినప్పుడు నేనేమీ బాధపడలేదు. ఆకలి దప్పులు తీర్చుకున్నాను అదే స్ఫూర్తితో.

బొల్లారం అనే గ్రామంలో 80 మంది కామ్రేడ్లను తప్పుడు కేసులలో ఇరికించి ఆ వూరిలోని భూస్వాములు జైలుకు పంపారు. ఈ సందర్భంలో ఆ కామ్రేడ్ల భార్యలకు ధైర్యం చెప్పడానికి వాళ్లదగ్గరకు పార్టీ నన్ను పంపింది.

రాత్రికి సమావేశం ఏర్పాటు చేశాం. ఆ సమావేశంలో వారు ఒక్కొక్కరు లేచి ఎంత ఉద్రేకంగా మాట్లాడారంటే నేను ఆశ్చర్యపోయాను. వాళ్లలో వున్న మనోనిబ్బరాన్ని, చైతన్యాన్ని చూసి సంతోషించాను. మరుసటి రోజు ... ఆకామ్రేడ్లను కలిసిన సంగతులు, వారి క్షేమం గురించి చెపుతూ శెలవు తీసుకున్నాను.

అప్పుడు నా మదిలో మెదిలింది గోదావరి పరులేకర్ గ్రంథం "వర్లి ఆదివాసుల తిరుగుబాటు". ఆమె వాళ్లను సమీకరించుకోవడానికి వాళ్ల మధ్య వుంటూ వాళ్లు తినే తవుడు రొట్టెలు తింటూ, మేకపాల టీ తాగుతూ గడిపింది. మా పాలమూరు జిల్లాలో అంబలే తిండి. అలా వాళ్ల మధ్య వుండి అంబలి తాగుతూ గడిపినప్పుడు నేనేమీ బాధపడలేదు. ఆకలి దప్పులు తీర్చుకున్నాను అదే స్ఫూర్తితో. బొల్లారం అనే గ్రామంలో 80 మంది కామ్రేడ్లను తప్పుడు కేసులలో ఇరికించి ఆ వూరిలోని భూస్వాములు జైలుకు పంపారు. ఈ సందర్భంలో ఆ కామ్రేడ్ల భార్యలకు ధైర్యం చెప్పడానికి వాళ్లదగ్గరకు పార్టీ నన్ను పంపింది. రాత్రికి సమావేశం ఏర్పాటు చేశాం. ఆ సమావేశంలో వారు ఒక్కొక్కరు లేచి ఎంత ఉద్రేకంగా మాట్లాడారంటే నేను ఆశ్చర్యపోయాను. వాళ్లలో వున్న మనోనిబ్బరాన్ని చైతన్యాన్ని చూసి సంతోషించాను. మరుసటి రోజు ... ఆకామ్రేడ్లను కలిసిన సంగతులు, వారి క్షేమం గురించి చెపుతూ శెలవు తీసుకున్నాను.



ప్రజల మధ్య వుంటే ఎంత సంతోషమో అది అనుభవించిన వాళ్లకే తెలుసు. ఆ ప్రజల కోసం ఏం చేసినా తక్కువే అనిపిస్తుంది. వాళ్ల ప్రేమ మధ్య ఆకలి దప్పికలు తెలియవు.

★

కవిత్వమ్

రైతు లేని రాజ్యం మరుభూమి

- ఐశయ్య

పచ్చ కాగితాలకన్నా
పిడికెడు విత్తులకే విలువనిచ్చే వెర్రిబాగులోళ్లం.
మట్టిపై మమకారాన్ని - మనిషిపై నమ్మకాన్ని,
ఇంకా కోల్పోని పాతకాలం మనుషులం.
నాగలి చేతబట్టిన వంశం మాది.
చావుపుట్టుకలను పుడమితోనే ముడివేసుకున్న
భూమిపుత్రులం మేము.

ఒకానొకప్పుడు
నేలతల్లి ఒడిలో కేరింతలాడిన మట్టిపాదాలు మావి.
త్రిసంధ్యలూ స్వేదసంద్రంలో ఈదులాడిన,
రాతికండరాలు మావి.
ఈ లోకపు శూన్య భిక్షా పాత్రికలోకి,
ధాన్యపు రాశులను ఎత్తిపోసిన హస్తాలు మావి.
ఆకుపచ్చని స్వప్నాలను ప్రతిష్టించుకున్న నేత్రాలు మావి
ఇవన్నీ గతకాలపు మధుర స్మృతులు.

దళారులు తెగబలిసిన తెగుళ్లులా,
బొట్లు బొట్లుగా మా నెత్తురు జుర్రుతోంటే,
కంఠానికి బిగుసుకున్న అప్పుల పాశాలు,
మా మూల్గులు పీల్చేస్తోంటే,
సత్తువుడిగి నిర్వేదంగా నిలచిన జీవచ్ఛవాలం నేడు.

దారి మళ్లిన సాగునీరు,
మా ఆశలను మోడువారుస్తోంటే,
ప్రపంచీకరణ భూతం,
పచ్చని మా భూములను కబ్జా చేస్తోంటే,
ఛిద్రమైన మా బతుకుల నగ్న సత్యాలను,
లోకానికి ఎఱుకపరచడానికి,
విష పాత్రికనాశ్రయించిన సోక్రటీసులం నేడు.

గిట్టుబాటు కాని ధరలు,
ప్రకృతి వికటాట్టహాసాలు,
చేసాచి ఆదుకోని ఆపన్న హస్తాలు



మా భుజాన ధరించిన నాగలిని,
పురాతన వస్తుశకలంగా చూస్తోన్న పిదపకాలంలో,
నెత్తురోడుతూ నాగేటిచాలుపై నిలచిన ప్రశ్నార్థకాలం నేడు.

కాసులే కడుపు నింపుతాయనుకొంటే,
పొగగొట్టాలే ప్రగతికి చిహ్నాలని భావిస్తే,
రింగురోడ్డులే ఆర్థికవృద్ధికి ఆనవాళ్లని విశ్వసిస్తే
అలాగే కానివ్వండి.

సస్యక్షేత్రాల నుండి మమ్మల్ని వెలివేసి,
విషవాయువులు ఎగజిమ్మే కర్మాగారాలనే స్థాపించుకోండి.
మా ఆయువులు పీల్చేసి,
బహుళజాతి కంపెనీలలో ప్రాణశక్తిని నింపండి.
మా గోరీల పునాదులపై
ప్రత్యేక ఆర్థికమండళ్ల ఆకాశహర్మ్యాలు నిర్మించుకోండి.

ఒకటి మాత్రం నిజం.
రైతులేని రాజ్యం ఎడారి.
అన్నదాత అడుగుజాడ కనుమరుగైన దేశం
మరుభూమి. ★

పుత్తడి

- యస్.వివేక్ నాథ్

బంగారం గారం పోతోంది!
పసిడికి రెక్కలొచ్చి
ఆకసాన ఎగురుతోంది!
తరుణుల వంటిన
పుత్తడి వస్తుధారణ
అపురూపమైంది!
కొనలేక గుడ్లు మిటకరిస్తూ
లొట్టలేస్తున్నారు మహిళలు!
అందని ద్రాక్షే నగల పరిస్థితి!
సామాన్యులు ఎగిసి అందుకో
లేని దీన దురవస్థ!
ఆడపిల్లలకు 'చిన్న'మైనా పెట్టి
చెవులకు ముక్కులకు
వస్తువులు చేయించలేక
పోతున్నామని వాపోతున్న



దుర్భర దరిద్రపు క్షణాలు!
నానాటికీ వగలు పోయే
పసిడి ధర కాంచి తరుణుల ఎద
భగభగ మండుతున్నది!
మహిళల పెదవులపై దరహాసాన్ని
చూచి ఓర్వలేక
పసిడి పరిహసిస్తున్నది!
బోసిమెడలో మగువల
అందాలు వెలవెలపోతున్నవి!
పెరుగుట తరుగుట కొరకే
నంటూ స్త్రీలు శపిస్తున్నారు!
బంగారు నగలు సింగారింపుకు
నోచుకోలేకపోతున్నందుకు
మిడిసిపడకే పసిడీ
అంటూ తిట్టి పోస్తున్నారు!! ★

పిల్లల్లో వచ్చే ఫిట్స్...

బాల్యంలో తొలి ఐదు సంవత్సరాలు అత్యంత ప్రధానమైనవి. ఆ వయస్సు వచ్చే లోపు పిల్లల్లో 5శాతం మందికి వివిధ కారణాల వల్ల వాయి (ఫిట్స్) వచ్చే అవకాశం వుంది. వాయి అనేది మెదడులోని విద్యుత్‌లో జరిగే మార్పుల వల్ల వస్తుంది. ఇది పెద్దవారిలో వచ్చే వాయి మాదిరిగానే కాకుండా కళ్లు ఒకవైపుకు పెట్టడం, కళ్లు ఎక్కువ సార్లు కొట్టడం, కాళ్లు, చేతులు మాత్రం కదిలించడం, ఆగకుండా చప్పరించడం లాగా కూడా ఉంటుంది. అసలు పిల్లలకు ఫిట్స్ రావడానికి కారణాలేంటి? నివారణా మార్గాలేంటి? వంటి వివరాలు ఈవారం తెల్సుకుందాం.

డా॥ పి. శ్రీకాంత్ రెడ్డి, నియోనాటాలజిస్ట్,
పిడియాట్రీషియన్,
శ్రీనివాసా పిల్లల ఆసుపత్రి,
అనంతపూర్. 9989465577.

చిన్నారులకు ఫిట్స్ రావడానికి కారణాలు అనేకం. బిడ్డ పుట్టిన మొదటి రోజుల్లో కొన్ని రకాల కారణాల వల్ల ఫిట్స్ వస్తుంటాయి.

పుట్టిన మొదటి రోజు

1. బిడ్డ పుట్టిన వెంటనే ఏడ్వకపోవడం వల్ల, 2. తలలో రక్తం గడ్డ కట్టడం వల్ల, 3. పుట్టుకతో వచ్చే మెటబాలిక్ ఇబ్బందుల వల్ల, 4. తల్లి మత్తు మందులు వాడడం వల్ల, 5. రక్తంలో చెక్కెర శాతం తక్కువ ఉండడం వల్ల, కాల్షియం తక్కువగా ఉండడం వల్ల, విటమిన్ బి6 తక్కువగా వుండడం వల్ల

పుట్టిన రెండవ/మూడవ రోజు

1. కాన్పు కష్టం కావడం వల్ల, కొన్ని ఫోర్సెప్స్ కాన్పుల్లో, 2. రక్తంలో చెక్కెర శాతం తక్కువగా వుండడం వల్ల, 3. కాల్షియం తక్కువగా వుండడం వల్ల, 4. గర్భంలో వచ్చే జబ్బుల వల్ల, 5. పుట్టుకతో వచ్చే ఇబ్బందులు. ఉదా : తల చిన్నగా వుండడం మొ॥, 6. టెటనస్

ఒక నెల నుండి మూడు సంవత్సరాల వరకు

1. నరాల వ్యవస్థకు వచ్చే ఇన్‌ఫెక్షన్స్

♦బ్యాక్టీరియల్ మెనింజైటిస్, ♦టీబీ మెనింజైటిస్, ♦ఎన్‌సెఫలైటిస్, ♦మలేరియా, ♦గవదబిళ్లల నుండి మెదడుకు వచ్చే ఇన్‌ఫెక్షన్, ♦తట్టు నుంచి మెదడుకు వచ్చే ఇన్‌ఫెక్షన్, ♦గర్భంలో వచ్చే ఇన్‌ఫెక్షన్లు.

2. మెటబాలిక్ కారణాలు :

•శరీరంలో నీటి శాతం పూర్తిగా తగ్గడం, •శరీరంలోని లవణాలు తగ్గడం లేదా పెరగడం వల్ల, •కాల్షియం/మెగ్నీషియం తగ్గడం వల్ల, • మెదడులోని గడ్డలు ఉదా : ట్యూబర్‌కులోమాలు, •మెదడులో రక్తనాళాలు చిట్లడం, •రక్తం గడ్డ కట్టడం, •కొన్ని రకాల మందులు ఎక్కువగా వాడడం వల్ల, •వడదెబ్బ వల్ల, రక్తపోటు ఎక్కువగా ఉండడం వల్ల, •జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు, •మూర్ఛ రోగం.

జ్వరం వల్ల వాయి

జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు 5 నెలల పిల్లల నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలకు వాయి వచ్చే అవకాశం ఎక్కువగా వుంటుంది. చాలా మంది పిల్లల్లో ఈ లక్షణం వుంటుంది.

ఈ విధమైన వాయి 10 నిమిషాలకన్నా ఎక్కువగా వుండదు. జ్వరం మొదలైన మొదటి 24 గంటలకు వస్తుంది. సామాన్యంగా ఒకసారి జ్వరం వచ్చినప్పుడు ఒకసారి మాత్రమే వాయి వచ్చే అవకాశం వుంటుంది. వాయి వచ్చి వెళ్లిన తర్వాత సామాన్యంగా పిల్లలు వెంటనే మామూలు స్థితికి వస్తారు.

నివారణ

పురిటి పిల్లల్లో వచ్చే వాయిని తల్లిదండ్రులు గుర్తించడం కొంచెం కష్టం. పురిటి పిల్లలు సరిగా పాలు తాగక పోయినా, సరిగా ఏడ్వకపోయనా, మామూలుకన్నా ఎక్కువగా నిద్రపోతూ ఉన్నా వెంటనే డాక్టర్ గారిని సంప్రదించడం మేలు. శరీరంలో చెక్కెర శాతం తగ్గినప్పుడు బిడ్డలు ఎక్కువగా నిద్రపోతూ ఉంటారు. దీనిని తల్లిదండ్రులు పాలు తాగి నిద్రపోతున్నట్లు భావిస్తారు. పాలు ఇవ్వక పోవడం వల్ల శరీరంలో చెక్కెరశాతం మరింత తగ్గి నిద్రనుంచి లేవకుండా ఉంటారు. పురిటి పిల్లలకు జ్వరం వచ్చిన వెంటనే వైద్య సలహా తీసుకోవాలి. పురిటి పిల్లలకు కామెర్లు ఎక్కువగా అయినప్పుడు సరైన వైద్యం తీసుకోకపోతే కూడా మెదడుకు ఈ కామెర్లు పాకి వాయి వచ్చే అవకాశం వుంటుంది. ఇది ముఖ్యంగా నెలలు నిండని పిల్లలకు రక్తంలో ఇన్‌ఫెక్షన్ వచ్చి తద్వారా మెదడుకు పాకి మెదడు వాపు వ్యాధి వచ్చి, వాయి వచ్చే అవకాశం వుంది. తల్లిపాలు తాపకుండా గేదెపాలు, ఆవుపాలు తాపడం వల్ల శరీరంలో కాల్షియం శాతం తగ్గి వాయి వచ్చే అవకాశం ఉంటుంది. బిడ్డ పుట్టిన తక్షణం ఏడవాల్సి వుంటుంది. బిడ్డ పుట్టిన వెంటనే ఏడవకపోవడం వల్ల మెదడుకు రక్తం, ఆక్సిజన్ అందక పోవచ్చు. కాబట్టి కాన్పులు ఎప్పుడూ డాక్టర్ పర్యవేక్షణలో జరగడం మంచిది. గర్భవతులు రెండు టెటనస్ ఇంజక్షన్లు తప్పకుండా తీసుకోవాలి. ఆవిధంగా తీసుకోక పోవడం వల్ల పుట్టిన బిడ్డకు టెటనస్ జబ్బువచ్చే అవకాశం వుంటుంది. కొంతమంది పిల్లలు పుట్టుకతోనే కొన్ని లోపాలు ఉదాహరణకు తల చాలా చిన్నదిగా వుండడం, మెదడులో కొన్ని భాగాలు అభివృద్ధి చెందకపోవడం లాంటి ఇబ్బందుల వల్ల కూడా వాయి వస్తుంది. గర్భవతిగా వున్నప్పుడు చాలా జాగ్రత్తగా వుండడం వల్ల బిడ్డకు కొన్ని వ్యాధులు గర్భంలోనే రాకుండా చూసుకోవచ్చు. పురిటి పిల్లలలో ఏ మాత్రం తేడా కనిపించినా వెంటనే వైద్యుల సలహా మేరకు వైద్యం తీసుకోవడం వల్ల వాయి రాకుండా కాపాడుకోవచ్చు.

జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు వచ్చే వాయిని కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కొంతమేరకు నివారించుకోవచ్చు. జ్వరం వచ్చిన వెంటనే శరీరాన్ని గోరువెచ్చని నీటితో రుద్దాలి. దాంతోపాటు పారాసెటమల్ మందు వేసుకొని డాక్టర్ గారి వద్దకు తీసుకొని పోవడంవల్ల వాయి రాకుండా నివారించుకోవచ్చు. ఈ రకమైన వాయి వచ్చే పిల్లల తల్లిదండ్రులు ఎల్లవేళలా పారాసెటమల్ మందును దగ్గర ఉంచుకోవడం మంచిది.

అన్ని వయస్సుల్లోని పిల్లల్లో వచ్చే మెదడువాపు వ్యాధిని డాక్టర్ గారి సలహా మేరకు పూర్తిగా నయం చేయించుకోవాలి. గవదబిళ్లలు, తట్టు నుంచి కూడా మెదడువాపు వ్యాధి వచ్చే అవకాశం వుంది. వీటికి వైద్యం తీసుకోవడం చాలా ముఖ్యం. చాలామంది తట్టుకు వైద్యం తీసుకోకుండా నాటు మందులు వాడుతూ ఉంటారు. ఇది చాలా ప్రమాదకరం.

పిల్లల్లో వచ్చే విరేచనాల వల్ల శరీరంలో లవణాలు తగ్గి వాయి వచ్చే ప్రమాదం ఉంది. ఓ.ఆర్.ఎస్. ద్రవాన్ని తాగిస్తూ డాక్టర్ గారి సలహా మేరకు మందులు వాడాలి.

పిల్లల్లో వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ. ఎండాకాలంలో ఎక్కువగా నీరు తాపుతూ ఉండాలి. పళ్లరసాలు ఇవ్వాలి. ఎండకు పిల్లలను తిరగనివ్వడం మంచిది కాదు.

కొంతమంది పిల్లల్లో వచ్చే మూర్ఛరోగానికి పూర్తికాలం మందులు సుమారు 3 సంవత్సరాల నుండి 5 సంవత్సరాల వరకు వాడాలి. ★

కథ

మాపు

- కె. శ్రీనివాస శాస్త్రి



"ఆనంద్ అనే పేరు నాకు సరిపడిందని మీరన్నట్లుగానే, సుందరి అనే పేరు మీకు చక్కగా సరిపోయిందని నేననుకుంటున్నాను. ఎందుకంటే...." నా మాటలు పూర్తి కాకముందే ట్రెయిన్ విజయవాడ స్టేషన్లో ఆగింది. నేను పూర్తిగా చెప్పని మాటలు "మీకు దేవకన్యకుండే సుందర రూపం ఉంది" అని నా మనసులోనే మిగిలిపోయాయి.

ఒక యువకుడు కంపార్ట్‌మెంటులోకి ఎక్కి "సుందరీ, జాగ్రత్తగా వచ్చావామ్మా?" అని ఆమె హేండ్‌బ్యాగును తీసుకున్నాడు.

ఆమె లేచి "జాగ్రత్తగానే వచ్చానన్నయ్యా" అని నా వైపు చూసి "మీరు తప్పకుండా రేడియోలో నా ప్రోగ్రాం వింటారు కదా! వుంటానండి. బై" అంది.

తెనాలి రైల్వేస్టేషన్లో ఏలూరుకు ఒక టికెట్ కొని ట్రెయిన్‌లో కూర్చున్నాను. నేను కూర్చున్న వైపున బెంచీలు ఖాళీగా వున్నాయి. కిటికీ దగ్గర కూర్చుని లోపలికి వీస్తున్న చల్లని పిల్లగాలిలో సేద తీర్చుకుంటూ దినపత్రిక తెరిచాను.

"జాగ్రత్తగా వెళ్లి రామ్మా, సుందరీ! ఇంటికి వెళ్లగానే ఫోన్ చెయ్యి. అని చెప్పిన పెద్దాయన, నీ హేండ్‌బ్యాగ్ జాగ్రత్తమ్మా" అన్న ఒక పెద్దావిడ మాటలు విని తలెత్తిచూశాను. అప్పుడే కంపార్ట్‌మెంటులోకి ఎక్కి ఒక యువతి నా ఎదుట కూర్చుని వుంది. ఆమె చేతిలో ఒక హేండ్‌బ్యాగ్ మాత్రమే వుంది. వేరే లగేజ్ ఏమీ లేదు. ఆమె సాధారణ మానవ స్త్రీ లాగా లేదు. ఆ బ్రహ్మదేవుడు అందాలన్నీ ఒకే వ్యక్తిలో తీర్చిదిద్ది సృష్టించిన బొమ్మలాగా వుంది. ఆమెకు వీడ్కోలు చెప్పిన పెద్దల మాటలను బట్టి ఆమె పేరు సుందరి. ఆ పెద్దలు ఆమె తల్లిదండ్రులై వుండవచ్చునని ఊహించాను. సుందరి అనే పేరు ఆమె విషయంలో సార్థకమైందంటే అతిశయోక్తి ఏ మాత్రమూ కాదు. నా చిన్నప్పటి నుంచి నాలో సహజంగా నరనరాన వంటబట్టిన ఈస్థటిక్‌సెన్స్ ఆ క్షణంలో బయటపడింది. ఈస్థటిక్‌సెన్స్ అంటే అందానికి స్పందించే లక్షణం. ఆమె అందాలను కళ్లతో ఆస్వాదిస్తూ అదే ఆలోచనలతో వార్తాపత్రికను పక్కన పెట్టాను. వెంటనే ఆమె నా వంక చూస్తూ "సార్, మీరెంత వరకు వెళ్తున్నారు?" అని అడిగింది.

నా ఆలోచనలతో పరధ్యానంగా వున్న నేను ఆమె మాటలను పట్టించుకోలేదు. రెండవసారి "సార్, మీరెంతవరకు వెళ్తున్నారు? అని అదే ప్రశ్న నా మనసులో ప్రవేశించింది.

"ఏలూరు వెళ్తున్నానండి" అన్నాను. అప్పుడామె "నేను మొదటిసారి అడిగినప్పుడు మీరు వేరే ఆలోచనల్లో వున్నారని అనుకున్నాను" అంది. నా మనసులో ఆమె అందం గురించిన ఆలోచనలను కప్పిపుచ్చుకుంటూ "అవునండీ, ఒక సమస్య గురించి ఆలోచిస్తూ మీరు మొదటిసారి అడిగినప్పుడు వినలేదు. సారీ" అన్నాను.

"ఈ మాత్రం దానికి సారీ ఎందుకండీ? ప్రతి మనిషికీ పెద్దదిగానీ, చిన్నదిగానీ జీవితంలో తప్పని సరిగా ఏదో ఒక సమస్య వుంటుంది కదండీ" అంది.

ఎంత తియ్యని కంఠం! ఆమె మాటలే అంత తియ్యగా ఉంటే ఆమె పాడితే ఇంకెంత తియ్యగా వుంటుందో అనే ఆలోచన నా మనసులో మెదిలింది. మరుక్షణమే మా ఇద్దరిలో ఒకరి సిక్స్‌సెన్స్ పని చేసినట్లుగా ఆమె "రేపు ఉదయం ఎనిమిదిన్నర నుండి తొమ్మిదిగంటల వరకు విజయవాడ రేడియోలో నేను శాస్త్రీయ కర్ణాటక సంగీతం పాడతాను. మీకు సావకాశం వుంటే వినండి" అంది.

"తప్పకుండా వింటానండి. మీకు అభ్యంతరం లేకపోతే రేపు మీరు రేడియోలో పాడబోయే ఒక కృతి పల్లవి వినిపిస్తారా?" సాహసించి అడిగాను.

"మీరు పాడమని అడిగారంటే మీకు సంగీతంలో ఆసక్తి వుందని అనుకుంటున్నాను" అని "ఇంతకన్నా ఆనందమేమి, రామా" అని కొంచెం సేపు అమృతం కురిపిస్తున్నట్లుగా మధురంగా పాడింది. పల్లవిలోని సంగతులన్నీ చక్కని అకారాలు, ఒదుగులతో క్రమబద్ధంగా చేతితో తాళం వేస్తూ లయబద్ధంగా, శ్రావ్యంగా వినిపించింది. ఆమె తియ్యని కంఠంలో నుండి వచ్చిన దివ్యగానాన్ని వినడం కంటే వేరే ఆనందమేముంది? అని నన్ను నేను ప్రశ్నించుకుని పరవశించాను.

"నా పాట బాగుందాండీ?" అని ఆమె అడిగిన ప్రశ్నతో నేను వాస్తవంలోకి వచ్చి "బాగుంది అనే మాట మీరు పాడిన అద్భుతమైన సంగీతానికి చాలా తక్కువ. సాక్షాత్తు సరస్వతీదేవి గానం చేస్తున్నట్లుగా నా మనసుకు అనిపించింది" అన్నాను.

"మీరు నన్ను మరీ ఎక్కువగా పొగిడేస్తున్నారు" అని గలగలా నవ్వింది. ఆ నవ్వు సెలయేటి ప్రవాహ ధ్వనులను గుర్తుకు తెచ్చాయి. కొంచెంసేపు నిశ్శబ్దం. ట్రెయిన్ చక్రాల ధ్వని మాత్రమే వినిపిస్తోంది.

"ఇప్పుడు మీరు పాడిన త్యాగరాజ కృతి బిలహరి రాగం, రూపక తాళంలో వుంది కదండీ?" అన్నాను.

"అయితే మీకు కర్ణాటక సంగీత పరిజ్ఞానం కూడా బాగా

వుందన్నమాట. మీరు పాడతారా?"

"పాడలేనండి. కాకపోతే శాస్త్రీయ సంగీతం అంటే చెవి కోసుకుంటాను. సంగీత కచేరీలు, రేడియోలో సంగీత కార్యక్రమాలు సాధ్యమైనంత వరకు అన్నీ వింటూ కృతులు, వాగ్గేయకారుల పేర్లను, రాగాలు, తాళాల పేర్లను కూడా ఆసక్తితో గుర్తుంచుకుంటాను. మీకు రేడియోలో బి.హైగ్రేడ్ వచ్చిందనుకుంటాను" అన్నాను.

"అప్పుడే ఎలా వస్తుందండీ? ఒక ఏడాది నుంచి మాత్రమే పాడుతున్నాను రేడియోలో. ప్రస్తుతం బి గ్రేడ్‌లో వున్నాను. బి.హైగ్రేడ్ రావాలంటే మళ్లీ ఆడిషన్‌కు హాజరు కావాలి".

"మీకు చాలా త్వరలోనే బి.హైగ్రేడ్, తర్వాత ఎ గ్రేడ్, ఆ తర్వాత నేషనల్ ప్రోగ్రాం, సంగీత సమ్మేళనం కార్యక్రమాల్లో కూడా అవకాశాలు వస్తాయని నాకు గట్టి నమ్మకంగా వుంది".

"నా సంగీతం గురించి మీ ఆలోచనలన్నీ ఎక్కడో ఆకాశంలో విహరిస్తున్నాయి. కానీ వాస్తవం ఎంత ప్రతికూలంగా వున్నా దానితో రాజీపడడమే మంచిదని నేను ఎప్పుడూ అనుకుంటాను".

"మీరు వేదాంత ధోరణిలో మాట్లాడుతున్నారు".

"ప్రతి మనిషికీ ఏదైనా సమస్య ఎదురైనప్పుడు జీవితంలో కొన్ని క్షణాలైనా వేదాంతిగా మారతాడు. అన్నట్లు మాటల్లోపడి అడగడం మరిచాను. మీపేరు?"

ఎంత తియ్యని కంఠం! ఆమె మాటలే అంత తియ్యగా ఉంటే ఆమె పాడితే ఇంకెంత తియ్యగా వుంటుందో అనే ఆలోచన నా మనసులో మెదిలింది. మరుక్షణమే మా ఇద్దరిలో ఒకరి సిక్స్‌సెన్స్ పని చేసినట్లుగా ఆమె "రేపు ఉదయం ఎనిమిదిన్నర నుండి తొమ్మిదిగంటల వరకు విజయవాడ రేడియోలో నేను శాస్త్రీయ కర్ణాటక సంగీతం పాడతాను. మీకు సావకాశం వుంటే వినండి" అంది.
"తప్పకుండా వింటానండి. మీకు అభ్యంతరం లేకపోతే రేపు మీరు రేడియోలో పాడబోయే ఒక కృతి పల్లవి వినిపిస్తారా?" సాహసించి అడిగాను.

"ఆనంద్"

"సంగీతం విని ఆనందించే మీకు ఆ పేరు సరిగ్గా సరిపోతుంది" అని మళ్లీ నవ్వింది. నేను కూడా ఆమెతో కలిసి నవ్వాను.

"కానీ విని ఆనందించడమే. గాయకుణ్ణి అవలేకపోయాననే అసంతృప్తి అప్పుడప్పుడూ నన్ను వెంటాడుతుంది. మీరన్నట్లుగా లేని దాని గురించి బాధపడకుండా వాస్తవికతతో రాజీపడడమే తృప్తినీ, సంతోషాన్నీ కలిగిస్తాయి".

"చూశారా! మీరు కూడా వేదాంత ధోరణిలో మాట్లాడుతున్నారు".

"మీరే ఇంతకు ముందు అన్నారుగా. ప్రతీ మనిషి ఒక్కసారైనా జీవితంలో వేదాంతి అవుతాడని" అని నవ్వేశాను.

ఆమె కూడా కలిసి నవ్వింది. "మీ పేరు సుందరికదండీ?" అనడిగాను.

"అవునండీ. ఇప్పటి వరకు మాటల్లో పడి నా పేరు చెప్పలేదు. మీకెలా తెలిసింది?"

"మీరు తెనాలిలో ట్రెయిన్‌లోకి ఎక్కుతున్నప్పుడే మిమ్మల్ని సుందరి అని సంబోధిస్తూ ఇద్దరు పెద్దవాళ్లు మీకు జాగ్రత్తలు చెప్పడం విన్నాను".

"వాళ్లు నా తల్లిదండ్రులండి. విజయవాడలో మా అన్నయ్య నా కోసం స్టేషనుకు వస్తాడు".

"ఆనంద్ అనే పేరు నాకు సరిపడిందని మీరన్నట్లుగానే, సుందరి అనే పేరు మీకు చక్కగా సరిపోయిందని నేననుకుంటున్నాను. ఎందుకంటే...." నా మాటలు పూర్తి కాకముందే ట్రెయిన్ విజయవాడ స్టేషన్లో ఆగింది. నేను పూర్తిగా చెప్పని మాటలు "మీకు దేవకన్యకుండే సుందర రూపం ఉంది" అని నా మనసులోనే మిగిలిపోయాయి.

ఒక యువకుడు కంపార్ట్‌మెంటులోకి ఎక్కి "సుందరీ, జాగ్రత్తగా వచ్చావామ్మా?" అని ఆమె హేండ్‌బ్యాగును తీసుకున్నాడు.

ఆమె లేచి "జాగ్రత్తగానే వచ్చానన్నయ్యా" అని నా వైపు చూసి "మీరు తప్పకుండా రేడియోలో నా ప్రోగ్రాం వింటారు కదా! వుంటానండి. బై" అంది.

"తప్పకుండా వింటానండి. బై" అన్నాను.

"రామ్మా చెల్లెమ్మా, వెళ్దాం. దేవుడు నీకు కంటి చూపును ఇవ్వకపోయినా, నిన్ను నువ్వు జాగ్రత్తగా కాపాడుకునే తెలివితేటలు ఇచ్చాడమ్మా. వాస్తవంతో రాజీ పడాల్సిందే" అంటూ ఇద్దరూ కంపార్ట్‌మెంటులో నుంచి దిగారు.

అతని మాటలు నా గుండెలో గునపాలను దించాయి. ఆ మాటలు నమ్మలేక క్షణకాలం నిశ్చేష్టుడనయ్యాను. ఇదేం విపరీతం! అంత సౌందర్యరాశి అంధురాలా! బాధ కలిగించే ఆశ్చర్యం నుంచి తేరుకుని, సుందరి తన అన్నతో ప్లాట్‌ఫారం మీద కలిసి వెళ్తూ వుండటాన్ని ఆమె కనుమరుగయ్యేంత వరకూ చూస్తూ కూర్చుండిపోయాను.

ఆమెతో నా సంభాషణను గుర్తుకు తెచ్చుకున్నాను. ఆమె వేదాంత ధోరణికి ఆమె అంధత్వం కారణమని గ్రహించాను. అంధత్వం వల్ల ఏర్పడిన లోపాన్ని సరిపుచ్చడానికి దేవుడామెకు శ్రవణశక్తిని అధికంగా ప్రసాదించాడని ఆమె కదలికలను బట్టి తెలుసుకోగలిగాను. ఆమె కళ్లు అంధురాలి కళ్లలాగా లేవు. వాటి కదలికలు మామూలుగానే వున్నాయి. నేను పేపర్ పేజీలను తిప్పినప్పుడు వాటి చప్పుడును బట్టి నేను కూర్చున్న చోటును సున్నితంగా ఊహించి నా వంక సూటిగా చూస్తూ మాట్లాడగలిగింది. ఆమె మాట్లాడుతున్నంతసేపూ నా స్థానంలో నుండి నేను కదలలేదు. ఆ కారణంగా నావైపే చూపును నిలిపి తను అంధురాలనే అభిప్రాయం నాకు కలగనీయకుండా తెలివిగా నాతో మాట్లాడింది. అంధురాలైనా ఆమె సున్నిత శ్రవణశక్తికి, తెలివి తేటలకు నా జోహార్లు. కానీ ఎన్నిరకాలుగా సమర్థించుకోగలిగినా ఆమె అంధత్వం జీవితంలో ఆమెకు రాజీపడలేని లోపం.

★



బెనారస్ విశ్వవిద్యాలయం





సారనాథ్ ఆలయం

కాశీ విశేషాలు

భారతీయుల పుణ్యక్షేత్రాల జాబితాలో అతిముఖ్యమైనదిగా చెప్పకునేది వారణాసిలోని కాశీ. కాశీకి వెళ్లి గంగానదిలో స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయని పూర్వీకుల నమ్మకం. అది ఎంతవరకు నిజమో కానీ అక్కడ సందర్శకులను ఆకర్షించే పురాతన ఆలయాలకు, ప్రదేశాలకు మాత్రం కొదవలేదు. ఆ పురాతన నగరం, జ్యోతిర్లింగాలలో పదోదైన విశ్వనాథుడు, అక్షిత్రయంలో ఒకరైన విశాలాక్షి వెలసినట్లు చెప్పకునే పవిత్రక్షేత్రం, భాగీరథీ తీరాన కొలువుతీరి ఉన్న మహాశ్మశానం ఇలా ఎన్నో మనం కాశీలో చూడొచ్చు. అంతేకాదు బౌద్ధ పుణ్యక్షేత్రాలైన బుద్ధగయ, సారనాథ్ వంటివాటిని కూడా సందర్శించవచ్చు.



విశ్వనాథుని ఆలయం

కాశీలో ఎక్కడ చూసినా చిన్న చిన్న సందులే. ఆ చిన్న సందుల్లోనే దుకాణాలు, వాహనాలు..... అందులోనే ఆవులు... అవి కూడా మనుషుల్లో కలిసిపోయి తిరుగుతుంటాయి. ఇక్కడి నుంచి వెళ్లిన వారు ఎక్కువగా ఆంధ్ర ఆశ్రమంలో బస చేస్తారు.

కాశీకి వెళ్లినవారు ముందుగా గంగానదిలో స్నానం చేసి తమ తమ పూర్వీకులను స్మరించుకుంటారు. ఆ తర్వాత దర్శనాలు మొదలు పెడతారు. కాశీ విశ్వనాథుడి, అమ్మవారి ఆలయాలు భక్తులను పరవశింపజేస్తాయి.

మహాశ్మశానం

గంగా నదీ తీరాన్ని ఆనుకుని సుమారు 100 ఘట్టాలుంటాయి. ఓ పక్క స్నానాలు చేస్తుంటే, మరో పక్క శవాలను నదిలో వదులుతుంటారు. ఈ దృశ్యం సందర్శకులకు భయంగొల్పుతుంది. ఈ స్నాన ఘట్టాల్లో కొన్నిటిలో శవదహనాలు చేస్తుంటారు. తర్వాత అస్థికలను గంగలో కలిపేస్తారు. అన్ని ఘట్టాల్లోకి ముఖ్యమైంది మణికర్ణిక ఘట్టం. ఇక్కడే శవదహనాలు చేస్తారు. ఈ ప్రాంతంలో ఫొటోలు తీయడం నిషేధం. ఇక్కడ స్నానం చేసిన తర్వాత భక్తులు విశ్వేరుణ్ణి సందర్శించుకుంటారు. హరిశ్చంద్ర ఘట్టంలో కూడా శవదహనం చేస్తారు. ప్రతి రోజూ సాయంత్రం హారతినిచ్చే 'ఆర్తి' కార్యక్రమం దశాశ్వమేధ ఘట్టంలో జరుగుతుంది. తులసీదాసు 'రామచరితమానస'ను తులసీ ఘట్టంలో రాశారని చెప్తారు. అసి ఘట్టమని అక్కడే ఎక్కువగా హోటళ్లు, రెస్టారెంట్లు ఉంటాయి. కాశీకి వచ్చినవాళ్లు ఎక్కువగా ఇక్కడే బస చేస్తుంటారు. అసి, దశాశ్వమేధ, ఆదికేశవ, పంచగంగ, మణికర్ణికల గుండా సాగే పంచతీర్ధ యాత్ర పాపాలను హరింపజేస్తుందని భక్తుల విశ్వాసం.

స్వర్ణ దేవాలయం

గంగానదికి పశ్చిమతీరాన మణికర్ణికా ఘట్టానికి సమీపంలో కాశీవిశ్వనాథుని ఆలయం ఉంది. సుమారు 16మీటర్ల ఎత్తు బంగారు గోపురమున్న ఈ ఆలయాన్ని స్వర్ణదేవాలయం అంటారు. ముస్లిముల, మొఘలుల దండయాత్రలో ఈ ఆలయం కొంత ధ్వంసమైంది. ఔరంగజేబు కాలంలో దీన్ని పాక్షికంగా ధ్వంసం చేయించి, దానికి దగ్గరలో జ్ఞానవాపి అనే మసీదును కట్టించారు. ఇది ఇప్పటికీ ఉంది. 18వ శతాబ్దంలో ఈ విశ్వనాథ ఆలయాన్ని ఇండోర్ మహారాణి అహల్యాబాయి హోల్కర్ కట్టించారు. పంజాబ్ రాజు రంజిత్ సింగ్ ఈ దేవాలయ గోపురాలను పూర్తిగా బంగారంతో రూపొందించేందుకు సుమారు టన్ను బంగారాన్ని ఇచ్చాడు. ఈ ఆలయం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులతో కళకళలాడుతుంది. మిగతా సమయంలో ఆలయ ద్వారాలు మూసేస్తారు. విశ్వనాథ

మందిరానికి సమీపంలోనే పశ్చిమంగా అన్నపూర్ణాదేవి గుడి ఉంది. ఈ ఆలయంలో బంగారంతో చేసిన దేవి విగ్రహం ఉంటుంది. పసిడికాంతులను విరజిమ్ముతూ ఉండే ఆ అమ్మవారిని చూడడానికి రెండు కళ్లు చాలవేమో అనిపిస్తుంది.

కాశీని దేవాలయాల నగరం అని కూడా అంటారు. ఇక్కడ అడుగడుగునా ఒక ఆలయం కనిపిస్తుంది. విశాలాక్షి మందిరం, కాలభైరవుడు, తిలాభాండేశ్వరుడు, వారాహి(కాశీ రక్షకురాలు), దండపాణి(సుబ్రహ్మణ్యేశ్వరుడు), బిందుమాధవుడు, కేదార మందిరాలు వంటివి అనేకం ఉన్నాయి. లేలేత సూర్యకిరణాలు పుడమి తల్లిని తాకే సమయంలో ఆ కిరణాల ప్రయాణాన్ని, ఆకాశంలో రంగులు మారుతున్న దృశ్యాన్ని చూస్తుంటే మనసుకు ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. సూర్యాస్తమయ సమయంలో దశాశ్వమేధ ఘట్టం నుంచి మణికర్ణికా ఘట్టం వైపు వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. దశాశ్వమేధ ఘట్టంలో హారతినిచ్చే వేడుక 'ఆర్తి' సమయంలో వేల మంది భక్తులు అక్కడకు చేరుకుని ఆ దృశ్యాన్ని చూసి తరిస్తారు. ఆ సమయంలో అక్కడి వాతావరణమంతా కనులపండుగగా తోస్తుంది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా మంత్రోచ్చారణ... వీనులవిందుగా ఉంటుంది. గంగానదిలో ఉదయం, సాయంత్రం పడవవిహారాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి.

విశ్వవిద్యాలయం... విశ్వనాథాలయం

ప్రపంచంలోనే అతి పెద్ద మూడో విశ్వవిద్యాలయమైన బెనారస్ విశ్వవిద్యాలయం ఇక్కడ ఉంది. అనిబిసెంట్ సహకారంతో 1916లో పండిట్ మదన్ మోహన్‌మాలవ్య ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేశారు. అప్పటి కాశీ మహారాజు దీనికోసం 1350 ఎకరాల భూమిని ఇచ్చారు. ఇందులో 128 విభాగాలున్నాయి. ఇక్కడ భారత్ కళాభవన్ మ్యూజియం ఉంది. పురాతన విగ్రహాలను, లోహాలతో చేసిన బొమ్మలను, పెయింటింగులను, రాతప్రతులను మనమిక్కడ చూడొచ్చు. ఈ విశ్వవిద్యాలయంలో పెద్ద విశ్వనాథాలయం ఉంది. ఈ ఆలయ ప్రాంగణంలోనే పార్వతి, వినాయకుడు, విష్ణుమూర్తి ఆలయాలు కూడా ఉన్నాయి. ఇక్కడికి సమీపంలోనే తులసీ మానసమందిరం ఉంది. ఈ మందిరం పాలరాతితో నిర్మించి ఎంతో అందంగా ఉంటుంది. ఈ ఆలయగోడలపై తులసీదాసు రచించిన రామాయణాన్ని మనం చూడొచ్చు. దీని పైభాగంలో తులసీదాసు విగ్రహం ఉంది. ఈ ఆలయానికి సమీపంలో ఉత్తరాన దుర్గ గుడి ఉంది. సమీపంలోనే గవ్వలమ్మ(గౌడీబాయి) గుడి, సీతమ్మ మడి ఉన్నాయి. అక్కడికి వెళ్లిన వారు తప్పకుండా గవ్వలమ్మకు ఐదు గవ్వలు వేస్తారు. సీతమ్మమడిలో సీతమ్మ భూదేవిలో ఐక్యమైపోతున్నట్లు భూమిలో విగ్రహం ఉంది. గంగానదికి ఆవలివైపు ఎత్తైన రాతి గోడలతో కాశీరాజు కోట ఉంది. ఆ కోటలో కూడా ఒక మ్యూజియం ఉంది. అందులో కాశీని ఏలిన రాజుల చిత్రపటాలు, ఆభరణాలు, యుద్ధసమయంలో వారు ఉపయోగించిన ఆయుధాలు ఉన్నాయి.

బౌద్ధ క్షేత్రం

కాశీ నుంచి 10 కిలోమీటర్ల దూరంలో బౌద్ధుల పవిత్రక్షేత్రం సారనాథ్ ఉంది. ఇక్కడ అనేక బౌద్ధ విహారాలు, స్తూపాలు, మందిరాలు ఉన్నాయి. కాశీ వచ్చిన వారు తప్పకుండా ఈ క్షేత్రాన్ని సందర్శిస్తారు. ఇక్కడే బుద్ధుడు తన శిష్యులకు ధర్మాలను బోధించడం ప్రారంభించాడు. ఇక్కడ ఓ పురాతన మ్యూజియం ఉంది. ఇందులో అశోకుని కాలం నాటి సింహస్తంభం, గుప్తుల కాలంనాటి శిల్పాలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. బుద్ధుని విగ్రహాలు, ఆయన జీవిత ఘట్టాలను తెలిపే విషయాలు శిలాఫలకాల మీద లిఖించి ఉంటాయి. 11వ శతాబ్దంలోని వారు ఉపయోగించిన వస్తువులను(మట్టి, లోహపు పాత్రలు, కత్తిపీటలు, కత్తులు, గొడ్డళ్లు, కూజాలు, కుండలు), 12వ శతాబ్దం నాటి శిలాశాసనాలను మనం అక్కడ చూడొచ్చు. గుప్తుల కాలంనాటి శిల్పాలు, లక్ష్మి, సరస్వతి, విఘ్నేశ్వరుడు, అర్ధనారీశ్వరుడు, అగ్ని, సూర్యుడు మొదలైన దేవుళ్ల చూపరులను ఎంతగానో ఆకర్షిస్తాయి. రాతితో నిర్మించిన బుద్ధమందిరం, గుప్తుల కాలంలో నిర్మించిన ధమెక్ స్తూపం నాటి శిల్పకళకు అద్దం పడతాయి. బుద్ధమందిరానికి సమీపంలోని చైనా మందిరంలో ఉన్న పాలరాతి బుద్ధ విగ్రహం చాలా అందంగా ఉంటుంది.

త్రివేణీ సంగమం

ప్రయాగనే త్రివేణీ సంగమం అంటారు. గంగా, యమున, సరస్వతి నదులు కలిసే ఈ ప్రదేశాన్ని ప్రయాగ అని, త్రివేణీ సంగమమని అంటారు. అయితే గంగా యమునలు కలిసే దృశ్యం మనం చూడగలం. కానీ సరస్వతీ నది మాత్రం అంతర్వాహినిగా ప్రవహించి మిగతా రెండింటిలో కలుస్తుంది. ఇక్కడ పుష్కరోత్సవం జరుగుతుంది. దీనినే కుంభమేళా అంటారు. ఆ సమయంలో కొన్ని కోట్ల మంది ఇక్కడ స్నానమాచరించేందుకు వస్తారు. తమ పెద్దలను స్మరించుకుంటారు. తర్వాత వేణీదానం చేస్తారు. ఇంకో విచిత్రమేమంటే అక్కడికి భార్యాభర్తలు వెళితే భర్తను భార్య ఒడిలో కూర్చోబెట్టి జడలు వేస్తారు. మూడు జడలు వేసి ఆ వెంట్రుకలను కత్తిరిస్తారు. ఈ పద్ధతిని దేశంలో ఒక్క ప్రయాగలోనే మనం చూస్తాం.

మహాబోధి వృక్షం

మహాబోధి వృక్షం బుద్ధగయలో ఉంది. సుమారు 2500ఏళ్ల కింద బుద్ధుడికి జ్ఞానోదయమైంది ఈ వృక్షం కిందే అని చెప్తారు. క్రీ.పూ 3వ శతాబ్దంలో అశోకుడు ఇక్కడ మహాబోధి ఆలయాన్ని కట్టించాడు. ఈ ఆలయం ఎత్తు సుమారు 170 అడుగులు. పిరమిడ్ ఆకారంలో ఉంటుంది. ఈ చెట్టుకింద చల్లని వాతావరణంతో ప్రశాంతంగా, మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. ప్రతి బౌద్ధ సన్యాసి తన జీవితంలో ఒక్కసారైనా బుద్ధగయకు వెళ్లి అక్కడి మహాబోధి వృక్షం కింద ధ్యానం చేస్తాడట. ★

సారనాథ్ బౌద్ధుల స్తూపం



స్వర్ణ దేవాలయం

సీతాకోక చిలుకలు

చేసేద్దాం



సీతాకోక చిలుకలను ఇష్టపడని వారెవరుంటారు? రంగురంగుల సీతాకోక చిలుకలు ఎగురుతుంటే అలా చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది కదా! మరి అవి మన గదిలోనే వుంటే.... అబ్బ ఎంత బాగుంటుందో! మరి చేసేద్దామా? ఎలా అంటారా? సీతాకోకచిలుకలను తయారుచేసి వాటిని మన గోడకు అంటించేసి.... మరి ఎలా తయారు చేయాలో చూద్దామా.

కావలసిన వస్తువులు :

గట్టి అట్ట, గమ్, కత్తెర, పెన్సిలు, పెయింటు (మనకిష్టమైన నాలుగైదు రంగులు), పెయింటు బ్రష్, బైండింగ్ వైరు.

తయారుచేసే విధానం :

ముందుగా గట్టి అట్టను తీసుకుని దానిని సీతాకోక చిలుక ఆకారాన్ని పెన్సిలుతో గీసి దానిప్రకారం కత్తిరించుకోవాలి. తర్వాత దాని శరీరం ఆకారాన్ని, వాటి రెక్కలమీద ఉండే రకరకాల ఆకారాలను అట్టమీద గీసి వాటిని నెమ్మదిగా కత్తిరించుకోవాలి. తర్వాత శరీరం ఆకారపు అట్టకు నలుపు రంగు వేసుకోవాలి. ఇంకా మిగతావాటికి మనకిష్టమైన రంగులు వేసుకోవాలి. బైండింగు వైరును 6 అంగుళాల పొడవుండేట్టు కత్తిరించుకోవాలి. దానికి కూడా రంగు వేసుకోవాలి. వాటిని పూర్తిగా ఎండనివ్వాలి. సీతాకోక చిలుక శరీరంగా కత్తిరించుకున్న దానికి తల భాగంలో రెండు రంధ్రాలు చేయాలి. ఇప్పుడు రంగు వేసుకున్న బైండింగు వైరును ఆ రంధ్రాల గుండా తీసి పైకి వంచాలి. తర్వాత దానిని సీతాకోకచిలుక ఆకారంలో కత్తిరించుకున్న అట్టమీద శరీరంలాగా గమ్‌తో అతికించాలి. తర్వాత వివిధ ఆకారాలలో కత్తిరించిన వాటిని కూడా రెక్కలపై అతికించాలి. ఇక సీతాకోక చిలుక తయారైపోయినట్టే. ఇదేవిధంగా మరికొన్నిటిని తయారుచేసుకుని గోడకు అతికించుకుంటే అందంగా ఉంటుంది.

నేనెవరిని?

నేస్తాలూ... నాకు ఒంటినిండా రంధ్రాలే. కానీ నీళ్లను మాత్రం నిలుపుకోగలను. ఇంతకీ నేనెవరినో మీకు తెలుసా?

జవాబు : స్పాంజి

సంతకం

ఫైడల్ కాస్ట్రో







ఎన్నున్నాయి?

హాయ్...ఇక్కడ అక్షరాల సమూహం వుంది కదా. అందులో క్రిస్మస్ పండుగకు సంబంధించిన కొన్ని పదాలు దాగున్నాయి. వీటిని వెతికి పట్టుకుని సున్నా చుట్టండే.

జవాబు: ...aroling,christmas,elf, presents, reindeer, ...udolph, santa, snowman,wreath, tree.

దారి చెప్దామా



తేడాలెన్నో...

ఫ్రెండ్స్... పైనున్న రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా వున్నా వాటిలో ఏడు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టి చెప్పండే.

చుక్కలు కలుపుదాం



ఎన్నున్నాయి?

నేస్తాలూ...పైన వింత ఆకారంలో ఒక జీవి వుంది కదా. దాని అవయవాలను ఒకసారి సరిగ్గా చూడండి. అవి ఒక్కొక్కటి ఒక్కో జంతువువి. ఇప్పుడు మీరు ఏం చేయాలంటే ఏ భాగం ఏ జంతువుదో చెప్పాలి.

పుస్తకాల పండుగ

- కె. అంజన

అందరూ సంక్రాంతిని నాలుగురోజులు జరుపుకుంటే విజయవాడ, ఆ చుట్టు పక్కల జిజ్ఞాసులు మాత్రం పదిహేను రోజులు జరుపుకుంటారు. దానికి కారణం అంతకుముందు వచ్చే పదకొండు రోజుల పుస్తకాల పండుగే. హైదరాబాద్ వాసులు కూడా అంతే. అందరూ క్రిస్టమస్ పండుగను ఒక్కరోజు జరుపుకుంటే వీరు మాత్రం 11 రోజుల పాటు జరుపుకుంటారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ డిసెంబర్ 11 నుంచి 27వ తేదీ వరకు జరగడమే అందుకు కారణం. పదిమంది ఆనందించేది, అందరినీ ఆహ్లాదపరిచేది ప్రతీదీ పండుగే. పుస్తకాల పండుగ కూడా అలాంటిదే. ఒక పెద్ద ప్రాంగణంలో వందలాది స్టాళ్లు ఏర్పాటు చేసి పుస్తకాలు ప్రదర్శించడమంటే పుస్తకప్రియులకు నిజంగా పండుగే. అటువంటి పుస్తకాల పండుగలకు హైదరాబాద్, విజయవాడ వేదికలు కావడం మన అదృష్టం. దేశంలోని సుప్రసిద్ధ ప్రచురణకర్తలెందరో ఈ ప్రదర్శనల్లో పాల్గొని లక్షలాది పుస్తకాలను పాఠకుల చెంతకు చేరుస్తుంటారు. పుస్తకప్రియులు ఎంతో ఆసక్తిగా బుక్ ఫెయిర్లు సందర్శించి పుస్తకాలు కొనుక్కొని వెళుతుంటారు. ఈ దృశ్యాలను చూచినప్పుడు 'పుస్తకాల పనైపోయింది' అన్న మాట నిజం కాదేమో... అందుబాటులోకి తెస్తే సంతోషంగా స్వీకరించేవారెందరో అనిపిస్తుంది. కన్నుల పండుగగా జరిగే పుస్తకాల పండుగ గురించి ఈ వారం అట్టమీది కథలో...మీకోసం!

పుస్తకం విజ్ఞానానికి ప్రతీక. విజ్ఞానమే సంపద. విజ్ఞానమే మహాశక్తి. తరతరాల విజ్ఞానాన్ని పోగుచేసి నేటి తరానికి అందించేది పుస్తకమే. బాల్యం నుంచి విజ్ఞాన తృష్ణను తీర్చుకునేందుకు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకునేందుకు, సామాజిక స్పృహను పెంచుకునేందుకు మంచి గ్రంథాల పఠనం దోహదం చేస్తుంది. పసితనం నుంచి చివరి వరకు పుస్తకాలు మంచి నేస్తాలుగా నిలుస్తాయి. మార్గదర్శకులుగానూ మారతాయి. మార్క్స్, గాంధీ, అంబేద్కర్ వంటి మహనీయుల జీవితాల్ని తీర్చిదిద్దడానికి మంచి పుస్తకాలు సాయపడ్డాయి. ఈ విషయాన్ని స్వయంగా వారే అంగీకరించారుకూడా. అందుకే "పుస్తకాలను ప్రేమించండి. అవి మీ జీవితాన్ని సుఖమయం చేస్తాయి. భావాలు, ఉద్రేకాలు, సంఘటనల భయంకర గందరగోళం నుంచి బయటపడేందుకు మీకవి స్నేహపూర్వకమైన సలహాలిస్తాయి" అని రష్యన్ మహా రచయిత మాగ్జిం గోర్కీ అన్నారు. అంతటి ప్రాధాన్యత కలిగిన పుస్తకాలను మన ముంగిటకు తీసుకొచ్చేవే పుస్తక ప్రదర్శనలు. ఈ బుక్ ఎగ్జిబిషన్లు మరిన్ని ప్రాంతాలలో జరగాలి. పుస్తకాలు ప్రవాహం తెంచుకొని వచ్చి పడాలి. కొత్త కొత్త అభిప్రాయాలతో, అనుభవాలతో అవి జనులను ఉత్తేజపరచాలి. తమ చుట్టూ గిరిగీసుకొని వున్న మనస్తత్వాల నుంచి విముక్తి కలిగించడానికి శరపరంపరగా పుస్తకాలు రావాలి. తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకొనేందుకు, కొత్త కాంతిని కనుగొనేందుకు విరివిగా పుస్తకాలు వచ్చిపడాలి.

పఠనాసక్తి తగ్గిందా?

టీవీ రాకముందు కాలక్షేపానికి కూడా పుస్తకాలే చదివేవారు. ఆ తర్వాత కాలక్షేప సాహిత్యానికి టీవీ ప్రత్యామ్నాయంగా మారింది. మీట నొక్కితే చాలు లోకాన్నంతా చూపించే వందలాది టీవీ చానెళ్లు వచ్చేశాయి. రావడమేకాదు! ఏలుతున్నాయికూడా. మన కాలాన్ని మనకు తెలీకుండానే హరిస్తున్నాయికూడా. అయితే 1990 నుంచి 2005 వరకు టీవీతో కాలక్షేపం చేసిన వారు మరలా పుస్తకంపై దృష్టి సారిస్తున్నట్టుగా అధ్యయనాలు చెప్తున్నాయి. అందుకే పుస్తకం స్థానం పుస్తకానిదే. యుగాలు మారినా, జగాలు మారినా, ఆచంద్రార్కం సంప్రదాయ సౌరభాలనూ, భాషాసంస్కృతులనూ, వివిధ రుచులనూ, మానవతా విలువలనూ చెక్కుచెదరకుండా కావాలన్నప్పుడల్లా కమనీయంగా అందించగలిగేది ఒక్క పుస్తకాలు మాత్రమే. ఇంట్లోనే కూర్చుని విశాలమైన విశ్వభ్రమణం చేయించగలిగే

పఠనం అనివార్యం

అన్ని భాషలకు, ప్రాంతాలకు చెందిన పబ్లిషర్లందరినీ ఒకచోటికి చేర్చేవి బుక్‌ఫెయిర్లు. వీటిద్వారా పాఠకులకు లక్షలాది పుస్తకాలు అందుబాటులోకి వస్తాయి. తమకు కావాల్సిన పుస్తకాలన్నీ ఒకేచోట అందుబాటులో వుంటాయన్న సంకల్పంతో కొన్ని వేల మంది సంవత్సరం పాటు వేచిచూస్తారు. టీవీ వీక్షకులు తిరిగి చదువువైపు మరలి పుస్తకాలు కొనుగోలు చేయడాన్ని గత మూడు బుక్‌ఫెయిర్లలో గమనించాం. బుక్‌ఫెయిర్‌ను వేదికగా చేసుకొని అనేక పుస్తక పరిచయ సభలు, ఆవిష్కరణ సభలు నిర్వహించడం, సాహిత్యంపై చర్చలు చేయడం, సమకాలీన అంశాలపై నిపుణులతో ముఖాముఖి నిర్వహించడం చేస్తున్నాం. వీటితోపాటు ప్రజలలో పుస్తకపఠనాసక్తిని పెంచడానికి కృషి చేస్తున్నాం. పుస్తకాలు చదవడం ద్వారానే ఎక్కువ విషయాలు తెలుసుకోవచ్చు, మరి ఏ మాధ్యమం ద్వారా ఇది సాధ్యంకాదు అనే విషయాన్ని ప్రజలకు తెలియచేయడం కూడా ముఖ్య ఉద్దేశ్యం. టీవీలో వారు చూపించిందే చూడాలి. పుస్తకంలో మనకిష్టమొచ్చిన అంశాన్ని ఎంచుకొని చదువుకోవచ్చు. చరిత్ర, సంస్కృతి, ఆర్థిక చరిత్ర, వలసవాదాల గురించి తెలుసుకోవాలంటే పుస్తకపఠనం అనివార్యం. అన్నిటికీ ఇంటర్నెట్టే పరిష్కారమనే వాదన సరైంది కాదు. ఇంటర్నెట్‌లో పొందుపరచని అనేక అంశాలను పుస్తకాల ద్వారా పొందవచ్చు. పిల్లల్లో 10 నుంచి 16 సంవత్సరాలలోపు పఠనాసక్తి పెంచనట్లయితే వారు మంచి చదువరులు కాలేరు. అందుకోసం పిల్లలకు కథలు చెప్పడం, వ్యాసరచన, పెయింటింగ్ వంటి ప్రత్యేకమైన పోటీలు నిర్వహిస్తున్నాం. తద్వారా పఠనాసక్తి పెంచుతున్నాం.

సాదినేని శ్రీనివాసరావు,
అధ్యక్షులు, హైదరాబాద్ బుక్ ఫెయిర్.

ఆత్మస్థైర్యం కలిగించేవి పుస్తకాలే

పుస్తకాల పండుగ విజయవంతంగా జరగాలంటే...పిల్లలు, పెద్దలు కలిసి కుటుంబసమేతంగా రావాలి. తల్లిదండ్రులు పిల్లలకు సాహిత్య పుస్తకాలు ఎక్కువగా చదివించాలి. అప్పుడు విద్యార్థుల ఆత్మహత్యలు, పిచ్చి ప్రేమలు, యాసిడ్‌దాడులు వుండవు. చదువంటే మార్కులు ర్యాంకులు మాత్రమే కాదు, జీవితం కూడా. పుస్తక పఠనం వల్ల ప్రపంచంలో జరిగే మార్పులను అర్థంచేసుకోవడానికి, సమస్యలు పరిష్కరించుకోవడానికి ఎంతో ఆత్మస్థైర్యం వస్తుంది. సాహిత్యంతో, సమాజంతో సంబంధం లేని చదువులు చదివి నెల తిరిగేసరికి వేల రూపాయలు సంపాదించి పొందే తృప్తికంటే... ప్రజలకోసమే జీవించిన భగత్‌సింగ్, చేగువేరా, సుందరయ్య... లాంటి వారి పుస్తకాలు అందచేస్తే, చదివితే అంతకంటే ఎక్కువ తృప్తి పొందవచ్చు.

కె. లక్ష్మయ్య, ఇన్‌చార్జి,
ప్రజాశక్తి బుక్‌హౌస్.

అపూర్వమైన శక్తి పుస్తకాలకు తప్ప వేటికీ వుండవేమో. గత కొన్నాళ్లుగా కనబడుతున్న బుక్‌ఫెయిర్‌కు వస్తున్న ఆదరణకూడా దీన్నే బలపరుస్తోంది. గతంలో అన్ని రకాల పుస్తకాలు చదివేవారు. ప్రస్తుతం నిర్దిష్ట విషయాలను లోతుగా అధ్యయనం చేస్తున్నారు. తమ కెరీర్‌కు, జీవితానికి ఉపయోగపడే అంశాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈమధ్యకాలంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మేనేజిమెంట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్, చరిత్ర, వ్యవసాయం, ఆరోగ్యం, ట్రావెలాగ్, డిక్షనరీస్, పిల్లల సాహిత్యం లాంటి అనేక రంగాలలోనేకాక న్యాయ సంబంధమైన, పర్యావరణం, సంగీతం ...అన్నిరకాల పుస్తకాలను సైతం తెలుగులో ప్రచురిస్తున్నారు. ఆ రంగాలలో ఆదరణ బాగా వుంది. అనువాద గ్రంథాలు విస్తృతంగా వస్తున్నాయి.

బుక్ ఎగ్జిబిషన్లు

ఇంత ఆదరణ వున్నప్పటికీ మొదటి ముద్రణ వెయ్యి కాపీలకే పరిమితం అవుతున్నది. దీనికి ప్రధాన కారణం సాహిత్యాన్ని ప్రజల దగ్గరికి తీసుకెళ్లే నెట్‌వర్క్ బలహీనంగా వుండడమే. ఆ వెలితిని కొంతమేరకైనా తీర్చుతూ... కొన్ని వేల రకాల పుస్తకాలను మన ముంగిటకు తీసుకొస్తున్నాయి బుక్ ఫెయిర్లు. అవి మన నగరాల్లో విడిది చేసిన వారం పదిరోజులు పుస్తక ప్రియులకు కన్నుల పండుగే. ప్రారంభంలో దేశరాజధానిలోను, రాష్ట్ర ముఖ్య పట్టణాలలోను సంవత్సరానికి ఒక పుస్తక ప్రదర్శన నిర్వహించేవారు. ప్రజల నుంచి, పుస్తక పరిశ్రమ నుంచి వస్తున్న స్పందన చూసి వాటిని మరింత విస్తరింపచేశారు. విజయవాడలో బుక్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన 1989లో ఆచరణ రూపు దాల్చింది. అప్పటి నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం పుస్తక ప్రదర్శన జరుగుతూనే వుంది. తప్పనిసరిగా చెప్పుకోవాల్సింది హైదరాబాద్ బుక్ ఫెయిర్ గురించి. 1985 నుంచి రాష్ట్ర రాజధానిలో దీనిని నిర్వహిస్తున్నారు. అలా హైదరాబాద్, విజయవాడలలో క్రమం తప్పకుండా గత రెండు దశాబ్దాలుగా 11 రోజుల పాటు ఈ ప్రదర్శనలు





నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనలో కనీసం 200 నుంచి 250 స్టాళ్ల వరకు ఏర్పాటు చేస్తారు. దేశ నలుమూలల నుంచి పేరున్న పబ్లిషర్లతో పాటు మన రాష్ట్రంలోని ప్రచురణకర్తలందరూ పాల్గొంటారు. గతంలో పాక్, బంగ్లాదేశ్ నుంచి కూడా స్టాల్స్ వచ్చాయి. ఈ ఫెయిర్‌లో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, సేజ్, ఓరియంట్ బ్లాక్ స్వాన్ వంటి అంతర్జాతీయ పబ్లిషర్లతోపాటుగా ఢిల్లీ, కలకత్తా, ముంబాయి, చెన్నై, బెంగుళూరు లాంటి మహా నగరాలనుంచి కూడా పబ్లిషర్లు వస్తున్నారు. విజయవాడ, హైదరాబాదుల నుంచి ఎక్కువ స్టాల్సు వస్తున్నాయి. అన్ని రకాల పుస్తకాలనూ మనకు ఒక చోట ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పుస్తకాలపై రాయితీ కూడా వుంటుంది. ఇవేకాక ఈ సంవత్సరం నవంబర్ 14 నుంచి 24 వరకు ఖమ్మంలో 50 ప్రచురణ సంస్థలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాయి. 1990 నుంచి 99 వరకు విశాఖపట్టణంలో పెద్ద ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఇవికాక విశాలాంధ్ర, ప్రజాశక్తితో పాటు మరికొంతమంది రాష్ట్రంలోని యాభై, అరవై పట్టణాలలో సంవత్సరానికోసారి పది రోజులకు తగ్గకుండా పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నారు. ఆ రకంగా సాహిత్యం ప్రజలకు అందుబాటులోకి వెళుతోంది.

వాక్ ఫర్ బుక్స్

పుస్తక మహోత్సవం సందర్భంగా పుస్తక ప్రియుల పాదయాత్ర మొట్టమొదటిసారిగా లండన్‌లో జరిగింది. ప్రతి సంవత్సరమూ జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగే వరల్డ్ బుక్ ఫెయిర్‌లో వాక్ ఫర్ బుక్స్ జరుగుతుంది. ఆ స్ఫూర్తితోనే పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహిస్తుంటారు. మన దేశంలో ఇది మొదటిసారిగా కలకత్తాలో 1989లో జరిగింది. ప్రముఖ సినీదర్శకుడు సత్యజిత్‌రే దీనికి పోస్టర్లు, బ్యానర్లు వంటి ప్రచారసామాగ్రికి రూపకల్పన చేశారు. సాధారణంగా ఈ పాదయాత్రలో రచయితలు, కవులు, కళాకారులు, మేధావులు, లాయర్లు, డాక్టర్లు, విద్యావంతులు, విద్యార్థులు పాల్గొంటారు. పుసక పఠనం ఆవశ్యకతను ప్రచారం చేయడమే ఈ పాదయాత్రల లక్ష్యం. ఇదేకాక...బుక్ ఫెయిర్ సందర్భంగా .... సాహితీవేత్తల శతజయంతులు, పుస్తకావిష్కరణలు, పుస్తకాలపై ఉపన్యాసాలు, విద్యార్థుల కెరీర్‌కు, పిల్లలకు, తల్లిదండ్రులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

బుక్ ఎగ్జిబిషన్లు x ఇతర ఎగ్జిబిషన్లు

బుక్ ఎగ్జిబిషన్లకు ఇతర ఎగ్జిబిషన్లకు ఒక తేడా వుంది. ఇతర ఎగ్జిబిషన్లలో వ్యాపారమే ప్రధానంగా వుంటుంది. వినిమయ సంస్కృతిని పెంచడమే వాటి ఉద్దేశ్యం. విక్రయాలతోపాటు విజ్ఞానాన్ని, వివేకాన్ని పుస్తకాల రూపంలో పాఠకులకు అందించడమే బుక్ ఎగ్జిబిషన్ల ప్రత్యేక విశిష్టత.

లాభం కాదు ప్రధానం!

పెట్టే ఖర్చుతో పోల్చుకుంటే ఈ ఎగ్జిబిషన్లలో పాల్గొనడం లాభసాటికాదు. లాభం రాకపోయినా, రాదని తెలిసినా బుక్‌ఫెయిర్‌లో పాల్గొనడానికి

ప్రజల వద్దకే పుస్తకాలు

1700 పుస్తకాలకు పైగా ప్రచురించిన మేం అన్ని భారతీయ భాషల్లోంచి అనువాదాలు, మూలగ్రంథాలు వంటి అనేక గ్రంథాల పునర్ముద్రణను చేపడుతున్నాం. దేశమంతటా, పుస్తక మేళాలను, ప్రదర్శనలనూ ఏర్పాటు చేయడం ద్వారా గ్రంథాలనూ, గ్రంథ పఠనాభ్యాసాన్ని ప్రోత్సహించడంలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాం. దీనికి తోడు ప్రయివేటు-పబ్లిక్ రంగ ప్రచురణ సంస్థల వారు ప్రచురించిన పెక్కు గ్రంథాలను ఎంపికచేసి సరసమైన ధరలకు అందించే పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో గ్రామీణ ప్రాంతాలలో కొత్తగా అక్షరాస్యులైన వారికి పనికి వచ్చే పుస్తకాల ప్రదర్శనలు కూడా ఉన్నాయి. ట్రస్టు ద్వారా ప్రపంచ పుస్తక ప్రదర్శనను ప్రతి రెండేళ్ల కొకసారి న్యూఢిల్లీలో ఏర్పాటు చేస్తున్నాం. 1972లో మొదటిసారి పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశాం. దేశంలో వివిధ ప్రదేశాలలో చేసిన ప్రదర్శనలన్నీ ఒక ఎత్తు, ఢిల్లీలో జరిగే ప్రపంచ ప్రదర్శన మరొక ఎత్తు. దీనిలో 1200కు పైగా దేశ విదేశాల ప్రచురణకర్తలు పాల్గొంటారు. 19వ ఢిల్లీ పుస్తకమేళా 2010 జనవరి ఆఖరివారంలో ఢిల్లీలో జరగనుంది. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడంతో పాటు పట్టణ, గ్రామీణ స్థాయిలో ప్రతి సంవత్సరం పుస్తక మహోత్సవాలను నిర్వహిస్తున్నాం. ఏటా నవంబర్ 14 నుంచి 20 వరకు, మేం చొరవ తీసుకుని జాతీయ పుస్తక వారోత్సవాలను విద్యాసంస్థలు, ప్రచురణ సంస్థలు, సాహిత్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నాం.

పత్తిపాటి మోహన్,
నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు విభాగం సంపాదకులు.

వెరైటీ పుస్తకాలకు వేదిక

అన్ని రకాల పుస్తకాలు స్థానికంగా లభించవు. బుక్ ఎగ్జిబిషన్లకు పది పదిహేను శాతం ఎక్కువ వెరైటీ పుస్తకాలు వస్తాయి. పాఠకులకు కూడా ఆ తేడా తెలుస్తుంది. కొత్త పబ్లికేషన్లకు డిమాండ్ వస్తే షాపుల్లో అడుగుతారు. అలా వారికి మార్కెట్ పెరుగుతుంది. నిరుద్యోగ యువత భీమవరం, గుడివాడ, వరంగల్‌లో చిన్న చిన్న ఎగ్జిబిషన్లు నడుపుకొని జీవిస్తున్నారు. అలా చాలా మంది బతుకుతున్నారు. సమాజాభివృద్ధికి ఈ విధంగా పుస్తక ప్రదర్శనలు సాయం చేస్తున్నాయి.

అశోక్, విజయవాడ బుక్ ఫెస్టివల్ అధ్యక్షులు.

నిరంతర ప్రక్రియ

బుక్ ఫెయిర్లు పుస్తకాల ప్రమోషన్‌కు ఉపయోగపడుతాయి. ఎంతోమంది పాఠకులకు కొన్ని వందల మంది ప్రచురణకర్తలకు, పుస్తకాలకు ఒక వేదికగా పనిచేస్తాయి. కొత్త సంబంధాలు ఏర్పరచుకోవడానికి సంధానకర్తలుగా వ్యవహరిస్తాయి. ఎలక్ట్రానిక్ మీడియా వల్ల తగ్గుతున్న పఠనాసక్తిని పెంచడానికి ఈ పుస్తక ప్రదర్శన అతి ముఖ్యమైనది. ఈ కాన్సెప్ట్ వామపక్ష సంస్థలైన ప్రజాశక్తి, విశాలాంధ్ర, ప్రారంభించినా జాతీయ స్థాయిలో... ప్రభుత్వ పుస్తక సంస్థ ఎన్‌బిటి దీన్ని దేశమంతా విస్తరింపచేసింది. ఎన్‌బిటి స్ఫూర్తితోనే ప్రతి రాష్ట్రంలోనూ పుస్తక ప్రదర్శనల నిర్వహణ జరగని విధంగా రెండు ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలలో ప్రతి ఏటా పుస్తక ప్రదర్శనలు నిర్వహించడం, ఆదరించడం, రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా తెలుగు ప్రజలకు గౌరవంగా చెప్పవచ్చు. అప్పడప్పడూ విశాఖపట్నంలో, ఖమ్మంలో కూడా పుస్తక ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఒకవైపు పుస్తక పఠనం తగ్గుతోందని అనుకుంటున్నా మంచి పుస్తకాలు వస్తే ఆదరించే వారున్నారని పుస్తక ప్రదర్శనకు వస్తున్న ఆదరణ చూస్తే తెలుస్తోంది. కనుక పుస్తక ప్రచురణ, పఠనం నిరంతరం కొనసాగించాల్సిన విషయాలు.

పి.రాజేశ్వరరావు,
ప్రగతి పబ్లికేషన్స్ సంపాదకులు.

దూరదూరాల నుంచి పబ్లిషర్లు వస్తుంటారు. కారణం! లక్షలాదిమంది చదువరులకు తమ ప్రచురణలను పరిచయం చేసుకునే అద్భుత సందర్భం అది. పైగా పాఠకులతో నేరుగా ముఖాముఖి, తమ ప్రచురణల గురించి చర్చించే అవకాశం అప్పుడే కలుగుతుంది. ఎలాంటి ప్రచురణలు తీసుకొస్తే ప్రజలు ఆదరిస్తారనే అంశాన్ని గమనించవచ్చు. తమ లోపాలను సవరించుకోవడానికి కూడా బుక్‌ఫెయిర్లు వేదికగా నిలుస్తాయి.

చక్కటి అనుభూతి

ఈ ప్రదర్శనలకు చిన్నారులను తప్పనిసరిగా వెంటబెట్టుకొస్తుంటారు పెద్దలు. వారిలో పఠనాసక్తిని పెంచేందుకు లక్షలాది పుస్తకాలకు వేదికగావున్న బుక్‌ఫెయిర్లను సందర్శిస్తున్నారు. తమ పిల్లలకు కావాల్సిన బొమ్మలతో కూడిన కథలు, భారతం, రామాయణం, భాగవతం వంటి ఇతిహాసాలు పిల్లల భాషలో అందుబాటులో వుంటాయి కాబట్టి వాటికోసం, తరగతి పుస్తకాలకు అనుబంధంగా వుండే రిఫరెన్స్ పుస్తకాల కోసం వస్తుంటారు. పసితనంలోనే పఠనాసక్తిని పెంచితే మున్ముందు పైచదువులు చదివే స్ఫూర్తి పిల్లలకు కలుగుతుందన్నది కూడా తల్లిదండ్రుల భావన. వీరేకాక సాహితీవేత్తలు, విద్యార్థులు ఒకటికి రెండు సార్లు వచ్చి కావాల్సిన పుస్తకాలు కొనుక్కుంటుంటారు. 'కొన్ని పుస్తకాలు కొన్నా ఇంకా కొనవలసిన మంచి పుస్తకాలు చాలా వున్నాయి. మరోసారి వస్తాం' అంటూ తిరిగివెళుతుంటారు. కొన్ని వేల పుస్తకాలను తనివితీరా చూశామన్న మధురానుభూతి వారి కళ్లలో ప్రతిబింబిస్తుంటుంది.

ప్రభుత్వ సాయమేదీ?

పుస్తకపఠనం పట్ల ఆసక్తినీ, చైతన్యాన్నీ కలిగించేందుకు ఏర్పాటు చేసే బుక్ ఎగ్జిబిషన్లకు అందే ప్రభుత్వ సాయం అంతంత మాత్రమే! మద్రాస్ బుక్ ఫెయిర్ నిర్వహణకు తమిళనాడు సీఎం శాశ్వత ప్రాతిపదికన వేదికను కేటాయించారు. ఆ రాష్ట్రంలోని పౌర గ్రంథాలయాలకు ప్రత్యేకమైన నిధులు జారీ చేసి బుక్ ఫెయిర్‌లో కొనుగోలు చేసే విధంగా ఉత్తర్వులు ఇస్తున్నారు. కలకత్తా బుక్‌ఫెయిర్ భారతదేశంలోనే నెంబర్ 1 బుక్‌ఫెయిర్‌గా గుర్తింపు పొందింది. అక్కడ రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్వహణలో పాలుపంచుకొంటోంది. పశ్చిమబెంగాల్ యూనివర్సిటీలకు, పౌర గ్రంథాలయాలకు ఈ బుక్‌ఫెయిర్‌లో పుస్తకాలు కొనుగోలు చేసేలా చూస్తుంది. రచయితల, కవుల పుస్తకాలను 500 కాపీల చొప్పున పౌరగ్రంథాలయాలకు కొనుగోలు చేసి వారికి అండగా నిలుస్తోంది. ఈ కార్యక్రమం వల్లనే ఆ రాష్ట్రాలకు సంబంధించిన సాంస్కృతిక, సామాజిక, చారిత్రక నేపథ్యాలకు సంబంధించిన సమగ్రమైన సాహిత్యం బయటికి వచ్చింది. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా హైదరాబాదులో పీపుల్స్ ప్లాజా నెక్లెస్ రోడ్డును శాశ్వత బుక్‌ఫెయిర్ వేదికగా నామమాత్రపు ధరకు కేటాయించాలని నిర్వాహకులు కోరుకుంటున్నారు. దీనివల్ల పాఠకులకు పుస్తకాలు అందడమేకాక, పబ్లిషర్లు బతకడానికి మార్గం కూడా దొరుకుతుంది.

బహుమతిగా పుస్తకం

పుట్టినరోజులు, పెళ్లిరోజులు, పండుగలు, పబ్బాలు... సందర్భం ఏదైతేనేం! బహుమతులు ఇస్తూనే వుంటాం. స్తోమతుకు తగ్గట్టు ఖర్చు చేస్తూనే వుంటాం. బొకేలు, బట్టలు, అలంకరణ వస్తువులు..అందచేస్తుంటాం. కానీ ... అలాంటి సందర్భంలో ఓ మంచి పుస్తకాన్ని బహూకరించాలని చాలామంది అనుకోరు! ఇకనుంచైనా ఆ అలవాటు చేసుకోవడం మంచిది. అవతలివారి వయసు, ఆసక్తి, అవసరాన్ని దృష్టిలో వుంచుకొని చక్కటి పుస్తకాన్ని ఎంపిక చేసి బహూకరిస్తే...ఎంతో ఉపయుక్తంగా వుంటుంది. మనం ఇచ్చే బట్టలు కొన్నాళ్లకు చిరిగిపోవచ్చు. వస్తువులు పాడైపోవచ్చు. కానీ పుస్తకం ద్వారా వారికి కలిగిన చైతన్యం, అందిన విజ్ఞానం మాత్రం ఎప్పటికీ వారి వెన్నంటి వుంటుంది. ఇలా మన చుట్టూ వున్నవారిలో పుస్తకపఠనాసక్తిని పెంచేందుకు మన వంతు ప్రయత్నం చేద్దాం. అందుకే! త్వరలో మన ముందుకు రాబోతోన్న బుక్ ఎగ్జిబిషన్లను తప్పక సందర్శిద్దాం. సంచులనిండా పుస్తకాలు కొని తెచ్చుకుందాం! ★





విజ్ఞాన వీచిక

దాదాపు 5,00,000 సంవత్సరాల క్రితం నుండి 'హోమోసెపియన్స్' అనే మనజాతి ఈ భూగ్రహాన్ని దాదాపుగా ఏలుతోంది. మనం భూమిని ఆక్రమించుకుని విస్తరించిపోయాం. నగరాలు నిర్మించుకున్నాం. సంక్లిష్టమైన భాషల్ని ఏర్పరచుకున్నాం. మన గ్రహంమీద అజమాయిషీ మాత్రమే కాకుండా సాంకేతిక నైపుణ్యంతో గ్రహాంతరాలాల్లోకి పాకిపోయాం. ఇంత 'ఘన' చరిత్ర గల మనల్ని మనం అంతరించి పోవడమన్న ఆలోచనలతో ఇబ్బంది పెట్టదలచుకోము. మన 'అభివృద్ధి' అంతా సర్వనాశనమైపోవడం మనం ఊహించలేం. కానీ ఇటీవల కాలంలో భూమి ధ్వంసమైపోతుందనీ, జీవం అంతరించిపోతుందనీ రకరకాల ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ సందర్భంగా వాస్తవాలేంటో చూద్దాం...

భూమి అంతరించదు

- డా॥ కాకర్లమూడి విజయ్

గత ఏడాది జరిగిన ఒక భౌతిక శాస్త్ర ప్రయోగంలో బ్లాక్‌హోల్స్ మాట అటుంచి అసలు ఆ ప్రయోగమే సంపూర్తి కాకుండా ఆగిపోయింది. అదే గనక కొనసాగితే కచ్చితంగా వినాశనమే జరిగేదనే వాళ్లు ఇంకా ఉన్నారనుకోండి.

కొంత కాలం క్రితం ఒక గ్రహశకలం భూమిని ఢీకొనే ప్రమాదం నుండి విజయవంతంగా బయటపడగలిగాం. ఆ శకలం భూవాతావరణంలో ఆవిరైపోయింది. ఒకవేళ అదే భూమిని తాకి వుంటే?

కొన్నేళ్ల క్రితం సునామీ వచ్చి ద్వీపాలను, తీరాలను అతలాకుతలం చేసింది. ఈ ఏడాదీ మరొకటి వచ్చింది. ఇలా సునామీలు మరింతగా విజృంభిస్తే?

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆశాజనకంగా ఉండకపోయే అవకాశాలే ఎక్కువని శాస్త్రీయ అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఈ మధ్య 2012వ సంవత్సరం గురించి చాలా ఉత్సాహంగా ఊహాగానాలు జరుగుతున్నాయి. ఆ సంవత్సరానికి అసలు ప్రపంచమే అంతరించిపోవచ్చని (పోతుందని), అందుకు సూచికగా మాయన్ జాతి వాళ్లు రూపొందించిన క్యాలెండర్ ఆ సంవత్సరానికి ముగియడాన్ని చూపిస్తున్నారు. వారి 5,126 సంవత్సరాల క్యాలెండర్ 2012 డిసెంబర్ 21కి ముగుస్తుంది. మనకు ఈనాడు అందుబాటులో ఉన్న బిలియన్ల డాలర్ల టెలిస్కోపులకు, అంతరిక్ష వాహనాలకు, అంతరిక్ష పరిశోధకులకు అందని 'రహస్యమేదో' మాయన్లకి తెలుసని కొందరి వాదన.

శాస్త్రీయంగా మాత్రం ఇందులో వాస్తవం లేదు. మాయన్ల లెక్కల ప్రకారం వారి క్యాలెండర్ అక్కడకు ముగియడం యాధృచ్ఛికం. ఆ తరువాత అదే క్యాలెండర్ పునరావృతమౌతుంది. మనకు ఏటేటా మారే క్యాలెండర్‌లాగే.

అసలు ఈ 2012 సందడి పుట్టుక ఇంకా కొంచెం వుంది. సుమేరియన్లు కనుగొన్న 'నిబిరు' అనే ఒక ఊహాజనిత గ్రహం భూమివైపుకు దూసుకువస్తుందన్న కథనం అప్పట్లో ప్రచారంలో ఉండేది. ఆ నిబిరు మే 2003లో భూమిని ఢీ కొంటుందనేవారు. కానీ అప్పుడు అలాంటిదేమీ జరక్కపోవడంతో ఈ తేదీని 2012కి మార్చారు. అదే సంవత్సరానికి మాయన్ల కాలసూచిక ముగియడంతో ఆ తరువాత భూమి ఉండదన్న ప్రచారం ప్రారంభమైంది.

అయితే కొన్ని శాస్త్రీయ వాస్తవాలు ఇలా వున్నాయి.

సౌర విస్ఫోటనలు : సూర్యుడిలో అప్పుడప్పుడూ అయస్కాంత దిశ మారుతూ ఉంటుంది. ఆ సమయంలో విపరీతమైన మంటలు ఎగసిపడుతుంటాయి. ఈ అయస్కాంత దిశ మార్పిడి ప్రతి 11 సంవత్సరాలకు జరుగుతుందనీ, ఆ లెక్కన మళ్లీ 2012/13లో జరిగే అవకాశముందనీ అంటున్నారు. ఒకవేళ అదే జరిగితే ఉత్పన్నమయ్యే ప్రభావాలు తీవ్రంగానే ఉంటాయన్నది ఒక అభిప్రాయం. అయితే దాదాపు 100 మిలియన్ మైళ్ల దూరం నుండి మంటలొచ్చి భూమిని కాల్చేయడం కల్ల. గతంలో ఇటువంటి సందర్భం 2003 నవంబర్ 4న జరిగింది. సౌరప్లాస్మా బిలియన్ల టన్నుల కొద్దీ భూమివైపుకి దూసుకువచ్చింది. తద్వారా వచ్చిన రేడియేషన్ మన రక్షణ వాతావరణానికి ఇబ్బంది కలిగించింది కూడా. ఆ ప్రభావం దాదాపు 5000 సూర్యుల శక్తి కలది. అప్పుడే ఏమీ జరగలేదు!

భూమికూడా తన అయస్కాంత దిశలను మార్చుకుంటుంది. అలా చాలాసార్లు జరిగింది. చివరిసారి 8,00,000 ఏళ్ల క్రితం జరిగింది. అప్పుడు జీవం అంతరించలేదు. అయస్కాంత తత్వం మారినపుడు అంతరిక్షం నుండి వెలువడే రేడియేషన్లు భూమికి హాని కలిగించవచ్చు. అలాగే, చాలా జీవులు అయస్కాంతత్వంపై మనుగడ సాగిస్తున్నాయి. కాబట్టి ఒకవేళ భూమి ధృవాలు మారితే పెనుమార్పులు సంభవించవచ్చు. అయితే జీవం అంతరించిపోతుందన్న భయమూ, నిదర్శనాలూ లేవు.

గ్రహశకలం భూమిని ఢీకొంటుందన్నది మరో వాదన. దాదాపు 900 అడుగుల వెడల్పున్న 'అపోఫిస్' అనే ఆస్టరాయిడ్ భూమిని ఢీకొంటుందన్న వార్తలున్నాయి. అది భూమికి సమీపంగా రావడం 2029కి గానీ జరగదు. ఇక అది ఢీకొనే అవకాశాలు 2,50,000లో ఒకటి మాత్రమే! అయితే అప్పటి వరకూ ఎందుకు? రేపే గ్రహశకలం ఢీకొట్టవచ్చు. అది ఈ రోజు మనకు తెలీదు. అది 1200 సంవత్సరాల క్రితం మాయన్లకు కచ్చితంగా తెలీదు.

ఇవన్నీ జరగకపోయే అవకాశాలే ఎక్కువ. కానీ మనకు తెలీకుండానే మన చర్యలే మన వినాశనానికి దారితీస్తున్నాయి. మన కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, ఏటేటా విజృంభిస్తున్న అంతుబట్టని వ్యాధులు, వందలాది సంవత్సరాల నుండి లక్షలాది మందిని బలి తీసుకుంటున్న వ్యాధులు, ఏ పరిణామానికి దారి తీస్తాయో తెలీని జీవశాస్త్ర పరిశోధనలు (జన్యు పరిశోధనలు), అణుపరిశోధనలు, నానో టెక్నాలజీ వంటివి మనల్ని సజావుగా, ప్రశాంతంగా, దీర్ఘకాలం మనుగడ సాగించడానికి మాత్రం దోహదపడవు.

ఇప్పటికే ఏటా వేలాది జంతు, వృక్ష జాతులు అంతరించిపోతున్నాయి. మన వంతు రావడానికి ఎంతోకాలం పట్టకపోవచ్చు. అందుకోసం మాయన్ల 'దూరదృష్టి', నోస్ట్రాడామస్ జోస్యాలూ అనవసరం. రెండుమూడు అణుయుద్ధాలో, క్రిమియుద్ధాలో చేస్తే 2012 వరకు కూడా ఆగనవసరంలేదు!

★

చాక్లెట్ స్నానం

చాక్లెట్ తింటుంటే ఎలా వుంటుందీ! ఎక్కడికో వెళ్లిపోతాం కదా!! అదే చాక్లెట్‌తో స్నానం చేస్తే ఎలా వుంటుందీ? అన్న ఆలోచన వచ్చింది. అంతే... చాక్లెట్ బాత్‌కి ఏర్పాట్లు జరిగిపోయాయి. ఎక్కడో కాదు! జపాన్‌లోని టోక్యో నగరంలోనే. ఆ ఘనతంతా ఓ రిసార్టువారు కొట్టేశార్లెండి. నీళ్లలో చాకో, బాత్ పౌడర్లు వేసి కలుపుతారు. ఆ నీటిని చాక్లెట్ బాత్ చేయాలనుకున్న వారి మీద పోస్తారు. ఇది మనమంతకు ముందు చెప్పుకున్న బీరు స్నానం లాంటిదే. కాకపోతే వాలెంటైన్స్ డే సందర్భాంగా ప్రేమపావురాలకు మాత్రమే ఈ సౌకర్యం. అంతేకాదండోయ్! ఈ రిసార్ట్‌లో... చాక్లెట్ స్నానమే కాదు వైన్ బాత్, గ్రీన్ టీ బాత్, కాఫీ బాత్ కూడా చేసేయొచ్చు. కాకపోతే దానికి తగ్గ బిల్లుకూడా మన చేతిలో పెడతార్లెండి!

బాతు కాదు ... కాయ

ప్రకృతి వింతలు ఎన్నో! మార్లిన్, లియొనెల్ పాట్రిడ్జ్ పెంచిన కూరగాయల తోటలో బాతు ఆకారంలో ఒక కాయ కాసింది. అది ఎలా ఉందంటే ఒక బాతు మెడ వెనుక్కు తిప్పి చూస్తున్నట్టుగా ఉంది. దానికి కన్ను, ముక్కు చాలా స్పష్టంగా నిజమైన బాతుకు మాదిరిగానే ఉన్నాయి. 'నేను నలభై సంవత్సరాలుగా కూరగాయలు పండిస్తున్నాను. ఇప్పటి వరకూ జంతువుల ఆకారంలో ఉన్న కూరగాయలను చూడలేదు' అని పాట్రిడ్జ్(62) అంటున్నాడు. మొదట్లో ఆయన దాన్ని చూడగానే ఎంటో అనుకున్నాడట. కాసేపటకిగానీ పోల్చుకోలేదట. 'నేను దాన్ని చూడగానే ఒక్కసారి పెద్దగా నవ్వాను. అది చాలా సహజంగా ఉంది. దాని కోసం మేం ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. ఇది పూర్తిగా సహజమైంది. ఇది బాతు ఆకారంలో తల వెనుకకు తిరిగి ఉంది. దాన్ని మేం తినం. ఎందుకంటే ఇది చాలా ఆరాధనీయంగా ఉంది' అని ఆయన చెప్తున్నారు. ఆయన కూతురు సోఫి(2) దాన్ని చాలా ఇష్టపడుతోంది. 'బాతు, బాతు' అని అంటూ కేరింతలు పెడుతోంది. దీన్ని చూసిన వారు మాత్రం అదలా పెరగడానికి వీళ్లే ఏదో చేశారనుకుంటున్నారట. ప్రకృతి ఎంత మాయ చేసిందో కదా!

తెలాస!

మృతుడితో పెళ్లా!

మగలి జాకీ విస్క్ అనే అమ్మాయి జోన్‌థాన్ జార్జ్ అనే అబ్బాయి 2008 నవంబర్‌లో లోకల్ టౌన్‌లో పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అన్నీ అనుకున్నట్టే జరిగితే ఇంకేముంది? పెళ్లికి సరిగ్గా రెండు రోజులుందనగా మోటారు బైక్ యాక్సిడెంటులో జార్జ్ చనిపోయాడు. అయితేనేం అతనినే పెళ్లి చేసుకోవాలనుకుంది మగలి. తను జార్జితో 2004 సంవత్సరం నుంచే సహజీవనం చేస్తున్నట్టు, ఇద్దరూ బ్యాంకు అకౌంటును కూడా షేర్ చేసుకుంటున్నట్టు అధికారులకు నిరూపించింది. పెళ్లి బట్టలను తెచ్చిన ఫొటోలను కూడా వారికి చూపించింది. ఆమె జార్జి ఫొటో పక్కన నిల్చుని స్వగ్రామంలోని ఓ కోర్టులో పెళ్లి చేసుకుంది. ఆ పెళ్లికి తన బంధువులు, స్నేహితులు 30 మంది దాకా హాజరయ్యారు. అయితే ఫ్రాన్సులో ఇదేం కొత్త కాదు. అక్కడ ప్రతి సంవత్సరం ఇలాంటి పెళ్లిళ్లు పది దాకా జరుగుతాయట.

విడాకుల కేకు

ఇప్పుడు లవర్స్‌డే, మ్యారేజ్‌డే, ఫ్రెండ్‌షిప్‌డేలే కాకుండా మరి కొద్ది రోజుల్లో ఈ జాబితాలో ఇంకో 'డే' కూడా చేరబోతుంది. అదేంటా అనుకుంటున్నారా? అది వింటే మీరు ఆశ్చర్యపోతారు. 'డైవోర్స్ డే' అంటే భార్యాభర్తలు విడిపోతే పార్టీ చేసుకోవడమన్నమాట. అదేంటి విడిపోతే బాధపడతారు కానీ సంతోషంగా పార్టీ కూడా చేసుకుంటారా? అని ఆశ్చర్యపోకండలా! అలా చేసేవాళ్లకూడా ఉన్నారు. భార్యాభర్తలు విడిపోతే వారు విడివిడిగా డైవోర్స్‌కేకులను తెప్పించుకుని తమ స్నేహితులతో పార్టీని జరుపుకుని కొత్త జీవితాన్ని ఆరంభించేస్తున్నారు. ఈ కేకుల మీద రకరకాల చిత్రాలను వేస్తున్నారు. నిరాశతో ఉన్న భార్యను తంతున్న భర్త, ఒక బ్రిడ్జిపై నుండి భార్యని తోస్తున్న భర్త, భర్త వెన్నెముకలో కత్తితో పొడుస్తున్న భార్య, అతని కాళ్లవరకు కారిన రక్తం వంటి చిత్రాలను ఆ విడాకుల కేకులపై వేస్తున్నారు. ఈ కేకులు ఒక్కోటి 60 నుండి 800 పౌండ్ల వరకు పలుకుతున్నాయట.



వికాసం

కాంప్లెక్స్ కబుర్లు

మనం రోజూ అనేక రకాల మనుషులను చూస్తూ ఉంటాం. అందులో ఆత్మన్యూనత, ఆధిక్య భావాలున్న వారూ ఉంటారు. ఈ రెండు రకాల భావనలూ ప్రమాదకరమైనవే. నష్టం చేకూర్చేవే. నిజానికి ఆ విధమైన భావనలతో ఉండడం వల్ల జీవితంలో చాలా నష్టపోతారు. ఎన్నో విలువైన వాటిని కోల్పోతారు. తమ జీవితాన్ని సుఖమయం చేసుకోవడంలో వ్యక్తిగత సామర్థ్యాన్ని ఉపయోగించుకోలేకపోతారు.

తల్లీకొడుకులు బట్టలు తీసుకోవడానికి వెళ్లారు. అక్కడ ఆ అబ్బాయి ఒక డ్రస్‌ను చూపించి 'అమ్మా ఈ డ్రెస్ ఎలా ఉంది?' అని చాలా ఆతృతగా అడిగాడు. అప్పుడావిడ 'బాగానే ఉంది. కానీ నీకా రంగు నప్పదు. నువ్వు కొంచెం నలుపు కదా!' అని అంది. అది విన్న ఆ అబ్బాయి మొహం ఒక్కసారిగా వాడిపోయింది.

❑❑❑

తండ్రీకూతుళ్లు వెళ్తున్నారు. అప్పుడు ఆ తండ్రి స్నేహితుడొకాయన కలిసి 'నీ కూతురా! చాలా పెద్దదైందే! ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. కానీ ఓ లోపం వుందోయ్! పిల్లకు నీ పొడవు రాలేదు. కాసింత పొట్టిగా ఉంది' అని అన్నాడు. దానికి ఆ అమ్మాయి మొహంలో మారిన రంగులను బట్టి తెలుస్తుంది పెద్దాయన మాటలు ఆమెను ఎంతగా నొప్పించాయో!

❑❑❑

ఇలాంటి సంఘటనలు మన జీవితాల్లో ఎన్నో సార్లు ఎదురై ఉంటాయి. నల్లగా ఉన్నావనో, అందంగా లేవనో, చదువులో మొద్దు అనో వేరే పిల్లలతో పోల్చిన పరిస్థితులు ఎదురై ఉంటాయి. అవి నిజమే అయినా పిల్లలకు వాటిని అర్థం చేసుకునే శక్తి ఉండదు. ఇంకా పరిణతి చెందని వారికి ఇటువంటి వ్యాఖ్యలు అనుకోకుండా నష్టం చేస్తాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యుల మాటలు ఆత్మన్యూనతా, ఆధిక్య భావనలకు దారి తీస్తాయి. అవి నెమ్మదిగా పెరిగి పెద్దవై పూడ్చలేని నష్టం ఏర్పడుతుంది.

ఒక స్థాయికి ఎదిగిన తరువాత గానీ భయం, నమ్మకం ఉంటాయని తెలుసుకుంటారు. కానీ ఒక్కోసారి వాటి ప్రభావం జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది. అది వ్యక్తిగత సమస్యలకు దారి తీస్తుంది. తమను తాము తక్కువ అంచనా వేసుకోవడం గానీ, ఎక్కువ అంచనా వేసుకోవడం గానీ చేస్తారు. ఇది వినాశకరమైన పరిణామాలకు దారితీస్తుంది.

ఆధిక్య భావన ఉన్న వారు తమ ఆధిపత్యాన్ని కోరుకుంటారు. వారు ఇతరుల విజయాలను, సామర్థ్యాన్ని ఒప్పుకోవడానికి ఇష్టపడరు. 'నా నిర్ణయాలు ఎప్పుడూ సరైనవిగానే ఉంటాయి' అని అనుకుంటుంటారు. తమకు ఉపకరించే మంచి మాటలు చెప్పబోతే లెక్కచేయరు. దానివల్ల వారు ఒక్కోసారి చాలా పెద్ద అపజయాలను ఎదుర్కొంటారు. ఆత్మన్యూనతా భావం ఉన్నవారు తమను తాము తక్కువ అంచనావేసుకుని, సమాజంలో సరిగా ఇమడలేక పోతుంటారు. అనవసరపు భయాలతో అపజయాల పాలవుతారు. దాని వల్ల తమకే కాకుండా తమ చుట్టూ ఉన్నవాళ్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది.

పిల్లలు మానసికంగా ఎదగడానికి తల్లిదండ్రుల పాత్ర చాలా అవసరం. పిల్లల రంగు, రూపురేఖలు, తెలివితేటల గురించి అతిగా పొగడడమో, అతిగా విమర్శించడమో చేయకూడదు. ఎందుకంటే వాటిని స్వీకరించే పరిణతి ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటుంది. ఫలితాలు కూడా వివిధ రకాలుగా ఉంటాయి. పిల్లల ప్రవర్తనకు, తెలివితేటలకు పూర్తిగా తామే బాధ్యులు కారు. కొంత వంశపారంపర్యంగానూ, కొంత పరిసరాల పరిశీలన వల్లనూ వారికి అబ్బుతాయి.

పిల్లల రంగు, తెలివితేటలు, అందం, చదువు గురించి గాకుండా వారి వ్యక్తిత్వాన్ని అభివృద్ధి పరిచే విషయాల మీద దృష్టి పెట్టడం మంచిది. రూపం, చదువు అనేవి ముఖ్యం కాదు. విజయమనేది తాత్కాలికం. దాని తరువాత జీవితంలో ఓటమనేది రాదు అని చెప్పటానికి లేదు. అందుకే ఎంత సామర్థ్యం ఉన్నప్పటికీ ఈ కాంప్లెక్స్ మూలంగా జీవితంలో ఎదగలేరు. విజయాలు సాధించలేరు. ఎదుటివారిని గౌరవించడం, నాగరికతను అలవర్చుకోవడం, ఇతరుల పట్ల దయగా ఉండడం ముఖ్యంగా సానుకూల దృక్పథంతో వ్యవహరించడం వారికి అలవాటు చేయాలి. అలా ఉండడం వల్ల విజయం తనంతట తానే దరి చేరుతుంది.

- సంధ్య

నవ్వుల్ - పువ్వుల్

పనికిమాలినవాడు

భర్త : మన చింటూగాడు అచ్చం నాకు లాగానే ప్రవర్తిస్తూ ఎక్కిరిస్తున్నాడుకదా. వాడిని ఎందుకు మందలించవు?

భార్య : పనికిమాలినవాడిలాగా ప్రవర్తించవద్దని తిడుతూనే ఉన్నాను.

ఎదుగుదల

జడ్జి: పది సంవత్సరాల నుండి నేను ఇదే కోర్టులో నిన్ను చూస్తున్నాను. ఏమాత్రం మార్పుగానీ, ఎదుగుదల కానీ లేదు.

ముద్దాయి : మీకు ఏ పదోన్నతి రాకపోవడం నిజంగానే బాధాకరమైన విషయమే అయ్యగారు.

ఖర్చు

కొడుకు : వివాహం చేసుకుంటే ఎంత ఖర్చు అవుతుంది?

తండ్రి : ఏమో నాకు సరిగా తెలియదు. నేను ఇప్పటికీ ఖర్చుపెడుతూనే వున్నాను.

ఒక్క పైసా

భక్తుడు : వందకోట్లు మీకు ఎంతతో సమానం దేవా?

దేవుడు : కేవలం ఒక పైసా.

భక్తుడు : కోటి సంవత్సరాలు ఎంతతో సమానం?

దేవుడు : కేవలం ఒక క్షణం.

భక్తుడు : అయితే నాకు ఒక పైసా దానం చేయండి స్వామీ.

దేవుడు : 'ఒక్క క్షణం' ఆగు భక్తా ఇస్తాను.

- యం. లక్ష్మీనారాయణ

ఇంతకముందు...

యజమాని : నీవు వంటపని గొప్పగా చేస్తున్నందుకు చాలా ఆనందంగా వుందోయ్. ఇక్కడకు రాకముందు ఎక్కడ పనిచేసేవాడివి?

వంటవాడు : గొడ్ల చావిడిలో మేతవాడిగా.

కాపీ

టీచర్ : శీను! నువ్వు రాణి పేపర్ నుండి కాపీ చేశావ్ కదా?

శీను : ఎలా చెప్పగలరండీ.

టీచర్ : రాణి తనకు జవాబు తెలియదని రాస్తే నువ్వు కూడా "నాక్కూడా" అని రాశావు.

అసాధ్యం

వేణు : అసాధ్యం అనే పదం నా నిఘంటువులోనే లేదు.

మాధవ్ : అయ్యో! సరిగా చూసి కొనుక్కోవలసింది.

ఆవిడకు తెల్సా!

విజయ్ : నన్ను భోజనానికి తీసుకువస్తున్నట్లు మీ ఆవిడకు తెలుసా?

అజయ్ : ఫోన్ చేసి చెప్పాన్లే. దీనిమీద వేడివేడిగా చాలాసేపు పోట్లాడుకున్నాం.

ఎంతవుద్ది?

తిక్కన్న : మా నాన్న చనిపోయాడు. అతని మరణవార్త మీ పత్రికలో ప్రచురించాలి. ఎంత ఖర్చు అవుతుంది?

ఎడిటర్ : ఒక అంగుళానికి 50 రూపాయలు.

తిక్కన్న : ఓరి నాయనో! మా నాన్న ఎత్తు 6 అడుగులు.

తేలు కుట్టిన దొంగలు

-సత్య

అధ్యక్ష భవనపు విందుకు వెళ్లి సలాహీ, మిచెల్లీ జంట ఇంత పేరు తెచ్చుకుంది గానీ అసలు నా ముందు వారెంత అంటోంది సెల్మా ఫోన్సెకా అనే ఓ ముదురు. ఇప్పటి వరకు రెండువేలకు పైగానే ఆహ్వానం లేని విందులకు వెళ్లానంటూ వీర ఫోజిస్తోంది. అసలు నాకెప్పుడూ పిలవకుండా వెళుతున్నా అనే భావమే లేదు, ఏమైనా సరే విందుకు వెళ్లాలి అనుకుంటే వెళ్లటమే అంటోంది. ఈ అనుభవాలన్నింటినీ త్వరలో ఒక పుస్తకంగా రాసి అచ్చేసి అలా వెళ్లే వారికి సాయపడతానంటోంది. అన్నట్లు ఇక్కడ మీకో విషయం గుర్తు చేయకతప్పదు మరి. మన రాష్ట్రంలో ఒక పార్లమెంట్ సభ్యుడున్నారు. ఆయన కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. పార్లమెంట్‌లో ఏ పార్టీ సభ్యుడు మాట్లాడుతున్నా ఆ సమయానికి ఆ సీటు వద్దకు చేరుకుంటారట(అయితే మనకేం అంటారా పార్లమెంట్ కార్యక్రమాలను టీవీల్లో చూపుతారు కదా మాట్లాడుతున్న సభ్యుడు కనిపించినా కనిపించకపోయినా సదరు ఎంపిగారు మాత్రం దర్శనమిస్తారు) ఇక బయట గ్రూప్ ఫొటోల్లో చెప్పేదేముంది. దీన్ని ఆహ్వానంలేని విందుకు వెళ్లటంతోనే పోల్చకతప్పదు మరి. ఇలాంటి విషయాలను గురించి ఎవరైనా ఒక ఉదంతం చెప్పారనుకోండి, ఇకచూస్కోండి చుట్టుపక్కల ఉన్నవారు తమకు తెలిసిన వాటన్నింటినీ ఏకరువు పెడతారు. బ్రిటీష్ ప్రిన్స్ విలియం 21వ పుట్టిన రోజు విందుకు 2003లో విండస్సర్ కాజిల్‌లోకి అరోన్ బార్‌చెక్ అనే అతను వెళ్లాడు, ఎలా అనుకున్నారు? ఒసామాబిన్ లాడెన్ వేషం వేసుకొని మరీ !

సెల్మా ఫోన్సెకా మూడు చిట్కాలు ముఖ్యం అంటోంది. ఒకటేమిటంటే మీరు పి డిడ్డీ వైట్‌పార్టీకి(పి డిడ్డీ అనే ఆఫ్రో-అమెరికన్ ప్రతిఏటా ఇచ్చే పార్టీకి అందరూ పై నుంచి కిందకు అన్నీ తెల్లటివే ధరించి రావాలి) మీకు ఆహ్వానం లేనట్లయితే వాటికి నల్లటి దుస్తులతో వెళ్లాలట. రెండవది ప్రవేశించగానే విడిగా ఉండకుండా అందరిలో కలిసిపోవాలి. మూడవది భద్రతా సిబ్బంది కళ్లలోకి కళ్లు పెట్టి చూడకూడదట. ఇదిలా ఉంటే టోబీ ఎంగ్ అనే బ్రిటీష్ జర్నలిస్టు మరొక చిట్కా చెప్పాడు. ఇలాంటి పార్టీలకు యువకులు ఒక్కరే వెళ్లకుండా పక్కన ఒక చిన్నదాన్ని కూడా తోడుతీసుకొని అడ్డుగా ఉండే తాడు సమీపిస్తుండగా చెవులు బద్దలయ్యే సౌండ్‌తో కారు స్టీరియోను ఆన్ చేసి వేగంగా పోనిచ్చామంటే అక్కడున్న వారు ఎందుకులే వినిపించుకోనేట్లు లేరని తాడు అడ్డు తొలగిస్తారట. సిగ్గూ ఎగ్గూ వదిలేస్తే ఇలాంటివే ఎన్నో చిట్కాలున్నాయి మరి. అయితే ఎవరైనా అలాంటి దుస్సాహసం చేస్తే ఇరుక్కుపోతారు. ఇప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సలాహీ జంటకు ఎప్పటి నుంచో ఒబమాతో పరిచయం ఉందన్నారు దాని గురించి చెప్పండి అంటున్నారు కదూ ! అటే వస్తున్నా ఉండండి. మిచెల్లీ గతంలో మిస్ అమెరికాగా ఎన్నికైందట.భర్తతో కలిసి పోలో ఆటల పోటీలను నిర్వహించటంలో భాగస్వాములుగా ఉన్నారు. అంతే కాదు మిచెల్లీ ఛీర్ గర్ల్‌గా కూడా తైతక్కలాడిందట.(ఈ మధ్య క్రికెట్ పోటీలలో చిట్టిపొట్టి బట్టలేసుకొని ఫోర్లు, సిక్సర్లు కొట్టినపుడు లేకపోతే వీక్షకులకు బోరుకొట్టినపుడు గ్రౌండ్ సమీపంలోని ఒక వేదికపై విన్యాసాలు చేస్తున్నవారిని అలా పిలుస్తారు.) ఆ రీత్యా ఒబామా ఇల్లినాయిస్ సెనేటర్‌గా ఉన్నప్పటి నుంచి అంటే 2005 నుంచీ సలాహీ దంపతులకు పరిచయం ఉందని కెనడా ఫ్రీ ప్రెస్ ఒక ఫోటోను కూడా ప్రచురించింది.

తాము వచ్చే ఏడాది అమెరికా-భారత్ మధ్య నిర్వహించే పోలో కప్ పోటీలకు భారత రాయబారి మీరా శంకర్ ఒక పాట్రన్ అని, తాము

ఇక అధ్యక్ష భవనం విందు విషయానికి వస్తే ఇంత జరిగాక అసలు విషయాలు కొన్నైనా బయటకు రాకుండా ఉంటాయా? వర్జీనియా జంట, అధ్యక్ష భవనంలో ప్రవేశానికి అవసరమైన అనుమతులకోసం ప్రయత్నించిన పెంటగన్ అధికారి ఎస్ జోన్స్ మధ్య నడిచిన ఇ మెయిల్స్ వివరాలు బయటకు వచ్చాయి. వాటి ప్రకారం అధ్యక్ష భవనపు విందుకు మీకు అవసరమైన ఆహ్వానాలకోసం నేను ఇప్పటికీ ఇంకా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాను. నాకు అనుమతి రాగానే మీకు కబురు చేస్తానని విందుకు రెండురోజుల ముందు అంటే నవంబరు 24వతేదీ ఉదయం 8.46కు సలాహీ జంటకు వర్తమానం పంపాడు. అయితే ఇరవయ్యవ తేదీనే ఈ జంట తమ వివరాలను వైట్ హౌస్‌కు గార్డనర్ లాగ్రూప్ అనే సంస్థద్వారా పంపారు. అయితే జోన్స్‌నుంచి గ్రీన్ సిగ్నల్ రాకుండానే ఈ జంట విందుకు వచ్చింది. మరుసటి జోన్స్‌నుంచి ఫోన్ వస్తుందనుకున్న సమయానికి నా సెల్ బ్యాటరీ ఛార్జింగ్ అయిపోయిందని అయితే తాము అప్పటికే వాషింగ్టన్ డిసికి చేరుకున్నామని సలాహీ చెబుతున్నాడు. అంటే వారు ఎలాగైనా విందుకు వెళ్లాలనుకున్నారు. వెళ్లారంతే !!

స్నేహితులమని, ఆమె అంగీకారంతోనే విందుకు వచ్చామని సలాహీ జంట చెబుతోంది. అమెరికా పోలో టీమ్ కెప్టెన్‌గా తారెఖ్ సలాహీ ఉన్నాడు. 'అసలేం జరిగిందో జరిగినట్లు చెప్పవే తల్లీ గొడవలైపోతాయని నేను కూడా మా అమ్మాయికి చెప్పాను ఏం చేస్తుందో ఏమో, కోతి పుండు బ్రహ్మారాక్షసి అయినట్లుగా ఈ వ్యహారం తయారైంది' అని మిచెల్లి తల్లి రోస్‌మేరీ మొత్తుకుంటోంది. అసలు చిక్కంతా ఇప్పుడు అల్లుడికి వచ్చిపడింది. అసలే అప్పుల్లో ఉన్నాడు. ఇప్పుడు వాళ్లంతా ఎగబడుతున్నారు. నా కుమార్తె ఒబామకు గట్టి మద్దతుదారు. జరిగిందానికి అదేమీ ఏడవటం లేదు. తాను విందుకు వెళ్లటంలో తప్పేమీ చేయలేదంటోందని రోస్‌మేరీ చెబుతోంది. సలాహీకి ఆస్తులు 3.35లక్షల డాలర్లుంటే అప్పులు 9.65లక్షల డాలర్లున్నాయి. ఈ ఉదంతం గురించి తారెఖ్ సలాహీ సోదరుడు డాక్టర్ ఇస్మాయిల్ సలాహీ మా అన్నా వదిన ఇలాంటి ధైర్యాలు చేసి పదిమంది దృష్టిని ఆకర్షించటంలో పేరు మోసిన చరిత్ర కలిగి ఉన్నారు. అందువలన నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు అన్నాడు.

ఆహ్వానంలేని అతిథులుగా వెళ్లే వారందరూ సిగ్గుమాలినోళ్లు కాదండోయ్ గౌరవనీయులు కూడా ఉన్నారంటే నమ్ముతారా !! తప్పదు మరి. సోనియా గాంధీ ఇచ్చిన విందుకు వెళ్లిన అమర్‌సింగ్ తనకు ఆహ్వానం ఉందని పిలిచి అవమానించారని ఒకసారి, సిపిఎం నాయకుడు హరికిషన్‌సింగ్ సూర్జిత్ కోరికను మన్నించి వెళ్లానని మరొకసారి చెప్పిన పెద్దమనుషులను ఈ తరగతి నుంచి పక్కన పెడదాం. ఐరోపాలోని ఫిన్లండ్ సర్కార్ అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాలకు నిరసన తెలిపేందుకు అక్కడి పౌరులు ఒక వినూత్న రూపాన్ని ఎన్నుకున్నారు. అదేమంటే విధాన నిర్ణేతలు గుమికూడే చోటికి ఆహ్వానం లేకుండా వెళ్లి నిరసన తెలపటంమే అది. ఈ నిరసనలు 1996 నుంచి ప్రారంభమయ్యాయి. పదేళ్ల నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా 2001లో కార్మికులు, ఉద్యోగులు,సమాజంలోని పలుతరగతులకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఆహ్వానంలేని విందుకు వెళ్లటమే ఒక నిరసన రూపంగా ఎంచుకొని హెల్సింకీలోని అధ్యక్ష భవనంలో జరిగే విందుకు వెళ్లారు. అనూహ్యమైన ఈచర్యతో పోలీసులు కంగారు పడి ఆశ్వికదళంతో సహా అన్ని బలగాలను వినియోగించి నిరోధించేందుకు ప్రయత్నించారు. మూడు మార్గాలలో వచ్చిన నిరసనకారులు కొంతమంది భవనంలోకి వెళ్లేవారిని నిరోధించగలిగారు. ఎలాగంటే రెండు మార్గాలలో వచ్చిన వారు తమ కార్ల హారన్లను పెద్దగా మోగించుకుంటూ రావటంతో పోలీసులందరూ వారి వైపు వెళ్లారు. శబ్దంలేకుండా కారుల్లో మరోమార్గంలో వచ్చిన వారు లోనికి వెళ్లారు. ఈ ఉదంతాన్ని మీడియా, ప్రభుత్వం కూడా బయటకు రాకుండా తొక్కిపెట్టింది.

ఇక అధ్యక్ష భవనం విందు విషయానికి వస్తే ఇంత జరిగాక అసలు విషయాలు కొన్నైనా బయటకు రాకుండా ఉంటాయా? వర్జీనియా జంట, అధ్యక్ష భవనంలో ప్రవేశానికి అవసరమైన అనుమతులకోసం ప్రయత్నించిన పెంటగన్ అధికారి ఎస్ జోన్స్ మధ్య నడిచిన ఇ మెయిల్స్ వివరాలు బయటకు వచ్చాయి. వాటి ప్రకారం అధ్యక్ష భవనపు విందుకు మీకు అవసరమైన ఆహ్వానాలకోసం నేను ఇప్పటికీ ఇంకా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాను. నాకు అనుమతి రాగానే మీకు కబురు చేస్తానని విందుకు రెండురోజుల ముందు అంటే నవంబరు 24వతేదీ ఉదయం 8.46కు సలాహీ జంటకు వర్తమానం పంపాడు. అయితే ఇరవయ్యవ తేదీనే ఈ జంట తమ వివరాలను వైట్ హౌస్‌కు గార్డనర్ లాగ్రూప్ అనే సంస్థద్వారా పంపారు. అయితే జోన్స్‌నుంచి గ్రీన్ సిగ్నల్ రాకుండానే ఈ జంట విందుకు వచ్చింది. మరుసటి జోన్స్‌నుంచి ఫోన్ వస్తుందనుకున్న సమయానికి నా సెల్ బ్యాటరీ ఛార్జింగ్ అయిపోయిందని అయితే తాము అప్పటికే వాషింగ్టన్ డిసికి చేరుకున్నామని సలాహీ చెబుతున్నాడు. అంటే వారు ఎలాగైనా విందుకు వెళ్లాలనుకున్నారు. వెళ్లారంతే !!

అమెరికా అధ్యక్ష భవనపు అధికారుల పరిస్థితి ఇప్పుడు తేలుకుట్టిన దొంగల్లాగా అసలేం జరిగిందో బయటకు చెప్పుకోలేని స్థితిలో పడ్డారు. పిలవని పేరంటం తారెఖ్-మిచెలి సలాహీ జంట ఝంఝాటాన్ని ఎలా వదిలించుకోవాలా అని చూస్తున్నారు. ఇప్పటికే జరిగినదానితో తలెత్తుకోలేని స్థితి. ఆ జంటను విచారణకు రమ్మని నోటీసు ఇవ్వాలా లేదా అన్న తర్జనభర్జన పడుతున్నారు. సూదికోసం సోదికి పోతే పాతవేవో బయట పడ్డాయన్నట్లు ఈ ఉదంతం అనేక అంశాలను బయట పెడుతోంది. ఇలా ఆహ్వానం లేని అతిథులు వైట్‌హౌస్‌కు రావటం లేదా అధ్యక్షుడి కార్యక్రమాలకు రావటం ఇదే తొలిసారి కాదని 1980 నుంచి ఇప్పటి వరకు 91 సార్లు అమెరికా అధ్యక్షుడి భద్రత ఉల్లంఘనలు జరిగినట్లు వెల్లడైంది. మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌తో తనకు 'ప్రత్యేక సంబధాలున్నాయని' చెప్పుకున్న ఒక మహిళ భద్రతా సిబ్బందిని దబాయించి లోనికి వచ్చిందట. అయ్యగారు గొప్ప గ్రంధసాంగుడు కదా రానివ్వకపోతే ఏం జరుగుతుందో అని భయపడి సాదరంగా లోనికి పంపి ఉంటారు. గొప్పవారి గోత్రాలు ఇలాగే ఉంటాయి మరి. ఇంకోసారైతే మినీవాన్‌లో ఒక కుటుంబమే భవనప్రాంగణంలో ప్రవేశించింది. సిబ్బంది శిక్షణ సందర్భంగా వారెంత అప్రమత్తంగా ఉండాలో ఉదాహరణలుగా చెప్పేందుకు సేకరించిన ఇలాంటి ఉదంతాల వివరాలు పత్రికలకెలా దొరికాయబ్బా అని తలలు కొట్టుకుంటున్నారు. మరోవైపు ఈ జంటకు ఇప్పటికే పదివేల మంది అభిమానులు ఏర్పడ్డారట. ★

సెల్మా ఫోన్సెకా మూడు చిట్కాలు ముఖ్యం అంటోంది. ఒకటేమిటంటే మీరు పి డిడ్డీ వైట్‌పార్టీకి(పి డిడ్డీ అనే ఆఫ్రో-అమెరికన్ ప్రతిఏటా ఇచ్చే పార్టీకి అందరూ పై నుంచి కిందకు అన్నీ తెల్లటివే ధరించి రావాలి) మీకు ఆహ్వానం లేనట్లయితే వాటికి నల్లటి దుస్తులతో వెళ్లాలట. రెండవది ప్రవేశించగానే విడిగా ఉండకుండా అందరిలో కలిసిపోవాలి. మూడవది భద్రతా సిబ్బంది కళ్లలోకి కళ్లు పెట్టి చూడకూడదట. ఇదిలా ఉంటే టోబీ ఎంగ్ అనే బ్రిటీష్ జర్నలిస్టు మరొక చిట్కా చెప్పాడు. ఇలాంటి పార్టీలకు యువకులు ఒక్కరే వెళ్లకుండా పక్కన ఒక చిన్నదాన్ని కూడా తోడుతీసుకొని అడ్డుగా ఉండే తాడు సమీపిస్తుండగా చెవులు బద్దలయ్యే సౌండ్‌తో కారు స్టీరియోను ఆన్ చేసి వేగంగా పోనిచ్చామంటే అక్కడున్న వారు ఎందుకులే వినిపించుకోనేట్లు లేరని తాడు అడ్డు తొలగిస్తారట. సిగ్గూ ఎగ్గూ వదిలేస్తే ఇలాంటివే ఎన్నో చిట్కాలున్నాయి మరి. అయితే ఎవరైనా అలాంటి దుస్సాహసం చేస్తే ఇరుక్కుపోతారు. ఇప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కొత్త పుస్తకాలు

ఈతరం తప్పక చదవాలి

మహాకవి శేషేంద్ర సాహిత్యాన్ని ఈ తరం యువ కవులు- కవయిత్రులు.. తప్పక అధ్యయనం చేయాల్సిన తరుణం ఇది. శేషేంద్ర అభిమానులకు శేషేంద్ర సమగ్ర సాహిత్య సంపద అందాల్సి వుంది. కవుల కవిత్వం - కవితారీతులు.. రచనలు మాత్రమే ప్రజలకు అందాలి. చైతన్య స్రవంతుల వైపు పయనింపజేయాలి. కవుల వ్యక్తిగత జీవితం, అలవాట్లు,- దురలవాట్లు అనవసరం -అప్రస్తుతం. తన తండ్రి శేషేంద్ర సాహిత్యాన్ని వారసుడిగా 'సాత్యకి' చేస్తున్న కృషి ప్రశంసనీయం. ఈ గ్రంథం చివర ప్రచురించిన గ్రంథస్వామ్య హక్కుల వివాదం, ముద్రణ- అనవసరం.

భువన విజయం పద్యనాటకంలో శ్రీ కృష్ణదేవరాయలుగా "శేషేంద్ర" నటించిన ఫొటోను ఈ గ్రంథ ముఖచిత్రంగా ప్రచురించారు. ధర కాస్త ఎక్కువగా ఉంది.

"వంద సూర్యులు ఉదయించు గాక, వంద చంద్రులు ఉదయించుగాక, విద్వాంసుని వాక్యాల వల్ల తప్ప లోపలి చీకట్లు చెదిరిపోవని" ఒక ప్రాచీన సూక్తి. అలాంటి చిరంతన సూక్తుల్ని నిరంతరం వినిపిస్తూ అర్ధ శతాబ్దంగా కవితా వ్యవసాయంలోనే కాదు, ఆధునిక కావ్య శాస్త్ర నిర్మాణంలో కూడా అఖండ ప్రతిభతో ప్రభవిల్లుతూ వచ్చిన కవి శ్రీ శేషేంద్ర అంటూ ఎ.బి.కె. ప్రసాద్ (పేజీ-9లో) రాసిన అభిప్రాయం, అచార్య కొసిరెడ్డి వెంకట రెడ్డిగారి అభిప్రాయం, స్మారకోపన్యాసం (పేజీ -15), వీక్షణం పత్రిక అభిప్రాయం, హైదరాబాద్ 'ఆద్మీకి ఆఖరి సలీ లాం!' ఎస్. జగన్ రెడ్డి వ్యాసం (పేజీ-101), గజల్ ఒక అయస్కాంత విద్య (పేజీ-117) అంటూ రాసిన వ్యాసాలు ఈ గ్రంథం ప్రాధాన్యతను, ప్రామాణికతను సూచిస్తాయి.

శేషేంద్ర కవిత్వం చదవకుండా రచయితకు ఆధునిక కవిత్వం కుదరనే కుదరదు. ఆయన రాసిన 'నా దేశం - నా ప్రజలు' చదివితే ఆధునిక కవిత్వ నిర్మాణ మార్గానికి ఒక శాస్త్రం లభిస్తుంది. ఈ 'కవిసేన మేనిఫెస్టో' కర్త 1955 ఆంధ్రా ఉపఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ వైపు నిలబడిన శ్రీశ్రీ ఓటమి పాలైన పార్టీ పరిస్థితికి విచారంలో- దాదాపు మతి స్థిమితం కోల్పోతాడు. ఆ సందర్భంలో "ఓటమి తాత్కాలికం" అంటూ శ్రీశ్రీని ఓదార్చిన శేషేంద్రను ఎమర్జెన్సీలో వెంగళరావు ప్రభుత్వం నిర్బంధ పదవీ విరమణకు గురి చేసింది. 1991 గల్ఫ్ యుద్ధాన్ని, అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఆయన ఖండించారు. శేషేంద్ర కవిత్వంపై చక్కటి పుస్తకం ఇది.

"పక్షులు" (పద్యకావ్యం)

"సముద్రం నా పేరు (వచన కవితా సంకలనం)"

"ఈ నగరం జాబిల్లి (గజల్ లక్షలక్షణాలను చెప్పే గీత కావ్యం)"

సంకలనకర్త : జి. సాత్యకి

పేజీలు : 155, వెల: 100/-.

ప్రతులకు : విశాలాంధ్ర, నవోదయ, నవయుగ పుస్తక విక్రయశాలలు.

- తంగిరాల చక్రవర్తి

సరళం...సరసం...సూటిదనం...

మన తెలుగు నవలా సాహిత్యంలో వెయ్యి నవలలు రాసిన ఏకైక రచయిత కొవ్వలి లక్ష్మీ నరసింహారావు. 1935లో 'పల్లెపడుచు' నవలతో ఎత్తిన కలం 1975 "కవి భీమన్న" దాకా వెయ్యి నవలలు రాశారు. సూటిగా, సరళంగా, సరసంగా తన భావాలను వెలిబుచ్చే నేర్పుతోనే నాటి "యువ" తరాన్ని, స్త్రీ పాఠకుల్ని కొవ్వలి ఆకట్టుకోగలిగారు. ఆయన రాసిన ప్రతి నవలా ఏదో ఒక సామాజిక సమస్యను ఇతి వృత్తంగా గ్రహించిందే! బాల్య వివాహాల ఖండన, వితంతు వివాహాల ప్రోత్సాహం, మతాంతర, కులాంతర వివాహాల విషయాలు ఒకటేమిటి ఆనాటి సమాజంలోని సమస్యలన్నింటినీ తీసుకొని కొవ్వలి వారు నవలలు రాశారు. చాలా తక్కువ ధరకు, "కొవ్వలి" తన నవలా సాహిత్యాన్ని పాఠకులకు అందించారు. గరిమెళ్ళ సత్యనారాయణ, చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ప్రశంసలందుకున్న కొవ్వలివారు రాసిన 18 ముఖ్యమైన మంచి నవలలను ఈ 571 పేజీల్లో అందించిన విశాలాంధ్ర వారి సాహిత్యాభిలాషకు అభినందనలు చెప్పితీరాలి. పండుగ మామూలు, పగటి వేషం, ఆషక్, రావుబహద్దూర్, వెర్రి వెంగళాయ్, భగవతి, భారతి, లక్షాధికారి, పెళ్ళిచూపు, లంబోదరం, చుప్పనాతి, బ్రతకడమెందుకు?, షోగ్గాడు, తప్పేముంది?, మోసపు భార్య, ఏడాది పున్నీ బీచ్‌లో హత్య, హియర్ హియర్... ఈ గ్రంథంలోగల నవలలు.

"శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రి" లాంటి పండితులు కొవ్వలి వారి "ఫ్లవర్ గర్ల్"ను చూసి భాషాద్రోహంగా ఉందని నిందిస్తే, సాధారణ పోస్ట్‌మేన్ (వీరాస్వామి) అదే వ్రాతప్రతిని చదివి మంచి ప్రచురణ నవలగా (పాములుడు) కీర్తించడం... వెనుక... సాధారణ పాఠకుల ఆదరణ, ఉత్సాహం.. కొవ్వలి వారి రచనలపై కనిపించే సత్యాలు.. సినిమాలకు కథలు- మాటలు రాసిన కొవ్వలి నవలా సాహిత్యం పఠనీయం.

"కొవ్వలి నవలలు కొన్ని"
రచన : కొవ్వలి లక్ష్మీ నరసింహారావు
పేజీలు : 571,
వెల: 250 /- రూ॥
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.

- ప్రసన్న

నూతన తరం శిల్పాలు





శిల్పాలంటే ఓ శిలనో, కొయ్యనో అందమైన ఆకృతిగా మలచడం, లేదా ఓ లోహాన్ని ఆకర్షణీయమైన ఆకృతిలో పోతపోయడం. ఇది సంప్రదాయంగా వస్తున్న అవగాహన. కాని నూతన తరం శిల్పకారుల ఊహాశక్తి అంతులేనిది. సంప్రదాయరీతులకు భిన్నంగా ఎంతో సృజనాత్మకంగా తమ భావాలకు రూపకల్పన చేస్తున్నారు. కాని వారి శైలి అత్యంత నూతనమైనది. మరొక విధంగా చెప్పాలంటే వీరు ఏదో ఒక పదార్థానికి, మీడియంకు రూపాన్ని అందించడం కాకుండా, ఆ పదార్థానికి పూర్తి భిన్నమైన కళాకృతిని కల్పిస్తున్నారు. ఇది పూర్తిగా నూతన సృష్టి. అలాంటి వారి కొందరి శిల్పాలను 2009 నవంబరు 25 నుండి డిసెంబరు 9 వరకు హైదరాబాదు కళాకృతి ఆర్ట్‌గ్యాలరీలో ప్రదర్శించారు. ఈ కళాకారులందరూ కలకత్తాకు చెందిన వారు. సాధారణంగా ఆయా కళాఖండాలలో వాటిని రూపొందించిన కళాకారుల ప్రాంతీయత, సాంస్కృతిక ప్రత్యేకతలు వ్యక్తమవుతుంటాయి. కాని ఈ శిల్పాలు పైకిచూడటానికి ఒకదానితో మరొకదానికి పోలికే కనిపించదు. ఇదే ఈ శిల్పాల విశిష్టత. కొయ్యతో నావ ఆకారంలో ఇద్దరు స్త్రీమూర్తుల శరీరాలను తీర్చిదిద్దిన శిల్పం గురించి ప్రత్యేకంగా చెప్పకోవచ్చు. సంసారాన్నే కాదు, మొత్తం ప్రపంచం అనే నావను సైతం సురక్షితంగా ముందుకు తీసుకు పోవడంలో ప్రధానపాత్ర స్త్రీదే అని ఈ శిల్పం చెబుతుంది. అలాగే 'ఫౌంటెన్' పేరుతో రూపుదిద్దుకున్న శిల్పంలో ఇద్దరు పసిబాలురు ఓ ఖడ్గంలో ఇమిడిఉన్న స్తన్యం కోసం ప్రయత్నించే దృశ్యం విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్లాస్టిక్ బొమ్మల స్క్రాప్‌తో ఆకర్షణీయమైన మరో బొమ్మను తయారు చేసిన శిల్పకారుని ఊహాశక్తి గురించి కూడా ప్రత్యేకంగా చెప్పకోవచ్చు.

-విజయరావు.

ఏడు కుండలు

-చూటీ

రామప్ప మంచి క్షురకుడు. భార్యతో కలిసి పట్టణంలో నివసించేవాడు. ఇతని పనితనం గురించి ఆ దేశపు రాజుకు తెలుస్తుంది. వెంటనే పిలిపించుకుని తన వ్యక్తిగత క్షురకుడిగా నియమించుకుంటాడు. వారానికోసారి రాజుగారి తల పని చెయ్యడం, గడ్డం గీయ్యడం అతని పని. అందుకు రాజుగారు బాగానే ముట్టచెప్పేవాడు. దాంతో వారు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా హాయిగా జీవిస్తుండేవారు.

ఇంతవరకు బానేవుండేది. మరి వారంలో మిగతా రోజుల మాటేమిటి? రామప్ప ఖాళీగా వుండేవాడు. చేతికి పనిలేకపోయినా బుర్ర ఊరుకోదుగా. దాని పని అది చేసుకుపోతుంటుంది. రాజభవనంలో మంత్రులు, అధికారులు వేసుకున్న బంగారు ఆభరణాలను చూచినప్పుడల్లా ఓ ఆలోచన వస్తుండేది.

"అంత బంగారం నా దగ్గర ఎందుకు లేదు? నేను పేదరికంలోనే చచ్చిపోవాలా?" అనుకునేవాడు. అతను అంత పేదవాడు కాకపోయినా ఏదో ఒక అసంతృప్తి మాత్రం అతణ్ణి ప్రశాంతంగా వుండనిచ్చేదికాదు.

ఓరోజు భార్యను పిల్చి "మనం డబ్బు ఆదా చేయాలి. బంగారం కొనాలి. అప్పుడు నువ్వు కూడా బంగారు నగలు పెట్టుకోవచ్చు. ధనిక మహిళల్లా ఎంచక్కా రోడ్డు మీద బడాయిగా నడవొచ్చు" అంటాడు.

ఆమె అందుకు అంగీకరిస్తుంది. ఇద్దరూ దుబారా ఖర్చులు తగ్గించుకొని పొదుపు చేయసాగారు. అలా రోజులు గడిచేసరికి కొంత డబ్బు జమవుతుంది. ఆ డబ్బుతో బంగారు గొలుసు, గాజులు కొంటారు. రామప్ప భార్య ఆ ఆభరణాలు అలంకరించుకొని అద్దంలో చూసుకొని ఎంతగానో సంతోషిస్తుంది. గర్వపడుతుంది. తనూ ధనిక మహిళల్లా రోడ్డుమీద గర్వంగా నడవొచ్చనుకుంటుంది.

అయినప్పటికీ రామప్పకు మాత్రం సంతృప్తి లేదు. మరింత బంగారం కొనడానికి మరిన్ని డబ్బులు పోగుచేయాలనుకుంటాడు. ఎప్పుడూ బంగారం గురించిన ఆలోచనే అతని మనసులో వుండేది.

ఓరోజు దగ్గరలో వున్న అడవికి వెళతాడు రామప్ప. చాలాదూరం నడిచాక అలిసిపోయి పెద్ద వృక్షం నీడలో కూర్చుని సేదదీరుతుంటాడు. అక్కడ కూడా బంగారం గురించే ఆలోచిస్తుంటాడు. మరింత బంగారం కొనాలంటే ఎలా? ఎలా? అని విపరీతంగా చింతిస్తుంటాడు. అప్పుడు

"ఓ రామప్పా! ఎందుకు విచారిస్తావు? నీకు ఏం కావాలో కోరుకో. నేను ఏమైనా సాయం చేయాలా నీకు?" అన్న మాటలు వినిపిస్తాయి.

ఆ మాటలు విన్న రామప్ప తెగ ఆశ్చర్యపోతాడు. అవి ఎక్కడి నుంచి వచ్చాయో అర్థమేకాదు. అక్కడ చెట్టు మాత్రమే వుంటుంది. చెట్టు చుట్టూ తిరిగి చూశాడు. ఏమీ తెలీలా! ఎవ్వరూ కనిపించలా!! ఒకవేళ అదే మాట్లాడిందా? అనుకుంటాడు ఒకక్షణంలో. కానీ చెట్టు ఎలా మాట్లాడిందో అతనికి అర్థమేకాదు! అతను ఈ గందరగోళంలో బుర్ర గోక్కుంటూ వుండగానే...



"ఏం రామప్పా! నా మాట మీద నమ్మకం లేదా? నేను నిన్ను చూడగలను. నాకు మనుషుల కోరికలు తీర్చే శక్తి వుంది. కాకపోతే నువ్వు నన్ను చూడలేవు. దాని గురించి భయపడకు. నీకు ఏం కావాలో కోరుకో" అంటుంది మళ్లీ.

రామప్ప ధైర్యం తెచ్చుకుని "ఓ కనిపించని దేవతా! నేను కోరుకునేది ఒక్కటే. అదే బంగారం. ఇంక నాకేం వద్దు" అంటాడు.

"అంతేనా రామప్పా! మరైతే నీకు ఏడుకుండల నిండా బంగారం ఇస్తే చాలా! ఇంకా ఏమైనా కావాలా?"

"అమ్మో! అంత బంగారమా! రాజుగారు కూడా అంత బంగారం పెట్టుకోడే!" అంటాడు రామప్ప ఆశ్చర్యానందంతో.

చెట్టు మాత్రం ప్రశాంతంగా నవ్వి "రామప్పా వెళ్ళి చూడు. నువ్వు ఇంటికెళ్లేసరికి ఏడు పెద్ద పెద్ద కుండలు కనిపిస్తాయి" అంటుంది.

రామప్ప జరిగిన సంఘటనను నమ్మలేకపోతాడు. కలగన్నాననుకుంటాడు. నిజమో కాదో తెల్సుకోవడానికి ఇంటికి పరిగెడతాడు.

రామప్ప ఇంటికెళ్లేసరికి భార్య అతనికోసమే ఎదురుచూస్తూ వుంటుంది. ఆమె ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూ...

"నువ్వు ఎక్కడికెళ్లావు? మన ఇంట్లోకి ఏడు పెద్ద పెద్ద కుండలొచ్చాయి. అవి ఎక్కడి నుంచి వచ్చాయో నాకుతెలీదు. వాటిని చూస్తే నాకు భయంగా వుంది. వాటి గురించి నీకేమైనా తెల్సా!" అనడుగుతుంది.

రామప్ప సంతోషిస్తూ..."రా! వాటిలో ఏముందో చూయిస్తాను" అంటూ భార్య చెయ్యి పట్టుకుని దాదాపు లాక్కెళ్లినంత పనిచేస్తాడు.

ఇద్దరూ లోపలికెళ్లి కుండలను పరిశీలిస్తారు. ఒక్కో కుండ మూత తీసి చూసి ఆనందపడిపోతారు. కుండల నిండా బంగారు ఆభరణాలు ధగధగా మెరుస్తూ కనిపిస్తాయి.

చివరి కుండ మూత కూడా తీసి చూస్తారు. అయితే అందులో సగం ఖాళీగా వుంటుంది. దానికతను దిగాలుపడిపోయి

"అబ్బా...మోసం జరిగిపోయింది. ఏడవ కుండ సగం మాత్రమే నిండింది" అంటూ విచారంగా కూర్చుండిపోతాడు.

రామప్ప భార్యకు విషయం ఏమీ అర్థంకాదు. అతని విచారానికి గల కారణం ఏంటో చెప్పమని అడుగుతుంది. అప్పుడు అతను జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్తాడు. అప్పుడు ఆమె

"మన దగ్గర చాలా బంగారం వుంది. ఏడు కుండల నిండా బంగారమంటే చిన్న విషయం కాదు. ఏడవ కుండ సగం నిండినా పెద్దగా బాధపడనవసరం లేదు. మనం కష్టపడి దాన్ని నింపుదాం. నువ్వు విచారపడకు" అని అతణ్ణి ఓదారుస్తుంది.

ముందు దిగాలుపడినా భార్య అన్న మాటల్లో సత్యం వుందని గ్రహిస్తాడు రామప్ప. మొహాన నవ్వు పులుముకొని

"ఏమైనా కానివ్వు. మనం ఏడవ కుండను కూడా బంగారంతో నింపేయాలి" అంటాడు.

అదేపిచ్చి పట్టుకుంటుంది ఇద్దరికీ. వచ్చే ఆదాయంలోనే కదా పొదుపు చేయాలి. ఇంక తిండి కూడా సరిగా తినకుండా కడుపు మాడ్చుకుని డబ్బు దాచిపెట్టడం మొదలెడతారు. దాంతో ఇద్దరూ బక్కగా తయారౌతారు. వారి ధ్యేయం ఒక్కటే. ఎలాగైనా ఏడో కుండ నిండా బంగారం నింపాలి. అంతే.

(ఇంతకీ రామప్ప ఏడవ కుండ నింపగలిగాడా? లేదా? తెలియాలంటే...
వారం రోజులు వేచిచూడాల్సిందే...)